


GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/53323

# సమయజ్యోతి

ప్రతీ అక్షరం - ప్రజలకోసం
తెలుగు దిన పత్రిక

CELEBRATING 12TH YEAR ANNIVERSARY

సంపుటి : 12 సంచిక : 177 పేజీలు : 12 ఆదిలాబాద్ వెల రూ : 01 ఆదివారం 28 సెప్టెంబర్ 2025 ఎడిటర్ : ఫైసల్ ఖాన్



దివంగత షఫీఉల్లా ఖాన్
మాజీ మేనేజింగ్ ఎడిటర్

## ఓటు చోరీతోనే ప్రధాని అయిన మోడీ

### ఓట్ చోరీపై గ్రామాల్లో సంతకాల సేకరణ

### టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్



హైదరాబాద్,సెప్టెంబర్27 (సమయజ్యోతి):

ఓటు చోరీతోనే మూడోసారి ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చారని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. అదే ఓటు చోరీతో మూడోసారి కూడా ప్రధాని కాగలిగారని, ఓటుచోరీ జరిగిందనడానికి ఇదే నిదర్శనమన్నారు. ఓటుచోరీని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ బయటపెట్టారని చెప్పుకొచ్చారు. ఓటు- చోరీతో ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగాన్ని తుంగలో తొక్కారని విమర్శించారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు ఓటు- చోరీ విషయంలో ప్రతి గ్రామంలో వందకు పైగా సంతకాలను సేకరిస్తున్నామని తెలిపారు. ఓటు చోరీ జరిగిందని నమ్ముతూ తాను సంతకం పెడుతున్నానని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో కనీసం వందకి తగ్గకుండా సంతకాలను టీ-పీసీసీ చేపడుతుందని తెలిపారు. ఓట్ చోరీకి బీజేపీ పాల్పడిందని ఆరోపించారు. ఇవా(శనివారం) గాంధీభవన్‌లో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడారు. ఓటు- చోరీతోనే తెలంగాణలో బీజేపీ 8 మంది పార్లమెంట్ సభ్యులు గెలిచారని తాను పాదయాత్రలో చెప్పానని అన్నారు. ఓటు- చోరీపై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఇప్పటివరకు ఎందుకు స్పందించ లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. ఎంపీ ఈటల రాజేందర్ మూడు లక్షల ఓట్ల గెలుపు వెనుక ఓటు- చోరీ ఉందని ఆరోపించారు. ఓటు- చోరీతో ప్రజాస్వామ్యానికి విఘాతమని చెప్పుకొచ్చారు.




## మరణించిన వారి ఖాతాల క్లెయిమ్

### 15 రోజుల్లోగా పరిష్కారం

### బ్యాంకులకు ఆర్‌బిఐ మార్గదర్శకాలు

ముంబయి,సెప్టెంబర్27(సమయజ్యోతి):

చనిపోయిన వారి బ్యాంకు ఖాతాలు, లాకర్లకు సంబంధించిన క్లెయిమ్ సెటిల్ మెంట్ నిబంధనలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సవరించింది. 15 రోజుల గడువులోగా సెటిల్‌మెంట్ ప్రక్రియ పూర్తవ్వాలని, ఒక వేళ ఆలస్య మైతే నిర్దిష్ట పరిహారాన్ని నామినీలకు ఇవ్వాల్సి ఉంటుందని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ఆ మేరకు 'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సెటిల్‌మెంట్ ఆఫ్ క్లెయిమ్స్ ఇన్ రెస్పెక్ట్ ఆఫ్ డిసీజ్డ్ కస్టమర్స్ ఆఫ్ బ్యాంక్స్ డైరెక్షన్స్ 2025' కింద సవరించిన నిబంధనలను జారీ చేసింది. వీటిని సాధ్యమైనంత త్వరగా

మిగతా 2 లో

## కుట్రపూరిత చర్యలతోనే ఎంజిబిఎస్ మునక

-వరద ప్రమాదం ఉన్నా వదలని జంటజలాశయాల నీరు

-పరివాహక ప్రజలను భయానికి గురిచేసేందుకు గేట్లు ఎత్తివేత

-మీడియా సమావేశంలో కెటిఆర్ విమర్శలు



హైదరాబాద్,సెప్టెంబర్27(సమయజ్యోతి):

సీఎం రేవంత్‌రెడ్డి పథకం ప్రకారమే ఎంజీబీఎస్‌ను ముంచారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. మూసీ ప్రాజెక్టు కోసమే సీఎం కిరాతకంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వరద హెచ్చరికలు ఉన్నా జలాశయాల నుంచి నీరు విడుదల చేయలేదని, ఉద్దేశ పూర్వకంగానే జంట జలాశయాల నుంచి నీరు వదల్లేదని ఆక్షేపించారు. మూసీ ప్రాంత వాసులను భయపెట్టేందుకే ఒకేసారి 15 గేట్లు తెరిచారని విమర్శించారు. ఎన్నడూ లేనిది ఇప్పుడే ఎంజీ బస్టాండ్ ఎందుకు మునిగిందని కేటీఆర్ ప్రశ్నించారు. ఇకపోతే ఏ వర్గానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత బాకీ పడ్డదో.. రేవంత్ సర్కార్‌ను నిలదీసి అడిగేందుకే ఈ బాకీ కార్డులకు రూపకల్పన చేశామని బీఆర్ఎస్ వర్కింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాష్ట్ర స్థాయి నాయకుల నుండి క్షేత్ర స్థాయి నాయకుల వరకు, అందరం రాష్ట్రంలోని ప్రతి ఇంటికి ఈ బాకీ కార్డులను తీసుకెళ్లి ఇస్తామని ఆయన తెలిపారు. తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ బాకీ కార్డు విడుదల చేసిన సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ మోసాలను ఎండగట్టి, ప్రజలను చైతన్య పరిచేందుకు ఈ బాకీ కార్డుల ద్వారా వినూత్న నిరసన కార్యక్రమం, ప్రచారం చేపట్టినట్లు- పేర్కొన్నారు. 100 రోజులు కాదు 700 రోజులైనా హామీలు అమలు చేయడం లేదు. వివిధ వర్గాలకు ఎంత బాకీ ఉన్నారో ఇందులో వివరించాం. 8 లక్షల పెండ్లిలు అయ్యాయి.. ఇప్పటి వరకు తులం బంగారం జాడన

## బలహీనవర్గాల నోటికాడి ముద్ద లాగవద్దు

### బిసిలకు నలభై రెండు శాతం రిజర్వేషన్లు

### అడ్డుకోవద్దు మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి

హైదరాబాద్,సెప్టెంబర్ 27(సమయజ్యోతి):


బలహీనవర్గాల నోటికాడి ముద్ద లాగవద్దని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు నలభై రెండు శాతం రిజర్వేషన్లు బలహీనవర్గాల నోటికాడి ముద్ద లాగవద్దని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు నలభై రెండు శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న తమ సంకల్పానికి ఎవరూ అడ్డుపడ వద్దని ఆయన కోరారు. పది శాతం ఇడబ్లుఎస్ రిజర్వేషన్లు ఇచ్చినప్పుడు ఎవరూ వ్యతిరేకించ లేదని ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ గుర్తు చేశారు



## స్కిల్ ఉంటే జపాన్, జర్మనీల్లో ఉద్యోగావకాశాలు

-సాంకేతిక నైపుణ్యంతోనే ఉద్యోగావకాశాలు

-ఇంగ్లీష్ ఒక్కటే ఉంటే ఉద్యోగం రాదు




-యువతలో స్కిల్స్ కోసమే టాటా కన్సల్టెన్సీతో చర్చలు
-వారి సహకారంతోనే ఎటిసి సెంటర్లు ఏర్పాటు
-మల్లేపల్లి ఎటిసి సెంటర్ ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్

2లో

## 31మంది మృతి..

### పలువురికి తీవ్ర గాయాలు టీవీకే అధినేత విజయ్ ర్యాలీలో తొక్కిసలాట మృతుల్లో ఆరుగురు చిన్నారులు ఉన్నట్లు గుర్తింపు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలింపు ఘటనపై సిఎం స్టాలిన్ ఆగ్రహం..సహాయక చర్యలకు ఆదేశం ఘటనపై ప్రధాని మోడీ



చెన్నై,సెప్టెంబర్ 27(సమయజ్యోతి):

తమిళనాడులో గోరం జరిగింది. టీవీకే అధినేత విజయ్ ర్యాలీలో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో 31 మంది మృతి చెందారు. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను కరూర్ ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో పలువురు చిన్నారులు ఉన్నట్టు స్థానిక ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. అనుకున్న సమయానికి ఆరు గంటలు ఆలస్యంగా వేదిక వద్దకు విజయ్ చేరుకోవడంతో ఆయనను చూసేందుకు ఒక్కసారిగా అభిమానులు ఎగబడ్డారు. దీంతో ఈ తొక్కిసలాట ఘటన చోటుచేసుకున్నట్టు- తెలుస్తోంది. రాత్రి 7:45 గంటలకు ఈ తొక్కిసలాట చోటుచేసుకుంది. ర్యాలీలో 30,000 మందికి పైగా జనం పాల్గొన్నట్టు- చెబుతున్నారు. విజయ్‌ను చూసేందుకు ఒక భవంతి పిట్టగోడపై పలువురు చేరడంతో పిట్టగోడ కుప్పకూలిందని, దీంతో పలువురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారని తెలుస్తోంది. దీంతో కొంత గందరగోళం, తొక్కిసలాట జరిగిందని తెలుస్తోంది.

## నేడు గ్రూప్-2 ఫలితాలు విడుదల

హైదరాబాద్,సెప్టెంబర్27(సమయజ్యోతి):

తెలంగాణ గ్రూప్-2 అభ్యర్థులకు శుభవార్త వచ్చింది.. గ్రూప్-2 ఫలితాలు విడుదలు ముహూర్తం ఖరారైంది. ఆదివారం గ్రూప్-2 ఫలితాలు విడుదల కాబోతున్నాయి. 783 పోస్టుల తుది ఫలితాలను ఆదివారం మధ్యాహ్నం రిలీజ్ చేయాలని టీజీపీఎస్సీ నిర్ణయం తీసుకుంది. దసరా పండుగలోపే తుది ఫలితాలు ప్రకటించి నియామక పత్రాలు అందజేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.



# 31మంది మృతి..పలువురికి తీవ్ర గాయాలు

మొదటిపేజీ తరువాయి

మరికొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు- తెలుస్తోంది. వీరిలో పార్టీ కార్యకర్తలతోపాటు ఆరుగురు చిన్నారులు కూడా ఉన్నారు. పదివేల మందితో ర్యాలీకోసం టివికె అనుమతి తీసుకుంది. అయితే కరూర్‌లో విజయ్ నిర్వహించిన ప్రచార సభకు భారీ సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. ఆయన ప్రసంగిస్తున్న సమయంలో వారిని నియంత్రించడం కష్టంగా మారింది. దీంతో తొక్కిసలాట పరిస్థితి ఏర్పడింది. అనేక మంది స్పృహతప్పి పడిపోయారు. పరిస్థితి గమనించిన ఆయన.. ప్రసంగాన్ని మధ్యలోనే నిలిపివేశారు. భారీ సమూహంలో అతికష్టం మీద అక్కడికి చేరుకున్న అంబులెన్సుల్లో బాధితులను ఆసుపత్రులకు తరలించారు. జనం భారీగా తరలిరావడంతో అంబులెన్స్‌లు వెళ్లడానికి కూడా దారిలేకుండా పోయింది. ఈ క్రమంలో తోణ సాయం అందక పలువురు మరణించారు. తమిళనాడులో తొక్కిసలాట ఘటనపై ప్రధాని మోదీ స్పందించారు. కరూర్‌లో ప్రచార సభలో దురదృష్టకర సంఘటన తీవ్రంగా కలచివేసింది. బాధిత కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. కష్ట సమయంలో వారికి మనోధైర్యం అందించాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'కరూర్ నుంచి వస్తోన్న సమాచారం ఆందోళన కలిగిస్తోంది. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులకు అన్ని రకాల సాయం అందించాలని ఆరోగ్యశాఖ మంత్రి, కలెక్టర్‌కు సూచించా. కరూర్‌లో సాధారణ పరిస్థితులు తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించా. వైద్యులు, పోలీసులకు సహకరించాలని కరూర్ పౌరులకు విజ్ఞప్తి చేస్తున్నానని ముఖ్యమంత్రి ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఇదిలావుటే పరిస్థితిని సమీక్షించేందుకు నేడు కరూర్‌కు సిఎం స్టాలిన్ రానున్నారు.

మొదటిపేజీ తరువాయి

## మరణించిన వారి ఖాతాల క్లెయిమ్

మార్చి 31 కంటే ఆలస్యం కారాదని తెలిపింది. నామినేషన్ లేదా సర్వైవర్‌షిప్ క్లాజ్‌తో ప్రారంభించిన డిపాజిట్ ఖాతాలకు సంబంధించి, డిపాజిటర్లు మరణించినపుడు నామినీ/సర్వైవర్‌కు వాటిని బదిలీ చేయడం బ్యాంకుల బాధ్యత అని ఆర్‌బీఐ తెలిపింది. నామినీ/సర్వైవర్‌షిప్ క్లాజ్ లేని ఖాతాల విషయంలో క్లెయిముల సెటిల్ మెంట్‌కు సరళీకృత ప్రక్రియ అవలంబించాలని స్పష్టం చేసింది. నిర్దిష్ట పరిమితికే ఇది వర్తిస్తుందని వివరించింది. ఖాతాలో సహకార బ్యాంకులకు రూ.5 లక్షలు, ఇతర బ్యాంకులకు రూ.15 లక్షలుగా ఈ పరిమితి ఉంది. ఈ పరిమితికి మించి మొత్తం ఉంటే వారసత్వ ధ్రువీకరణ పత్రం లేదా చట్టబద్ధ వారసత్వ ధ్రువపత్రం వంటి అదనపు పత్రాలను కోరవచ్చని తెలిపింది. ఆలస్యమైతే ఇదీ పరిహారం: 15 క్యాలెండర్ దినాల్లో క్లెయిమ్ సెటిల్‌మెంట్ చేయకపోతే.. బ్యాంకు ఖాతా విషయంలో 4శాతం వడ్డీ రేటుకు తక్కువ కాకుండా పరిహారం ఇవ్వాల్సి ఉంటుంది. సేఫ్ డిపాజిట్ లాకర్/కస్టడీలోని వస్తువుల విషయంలో.. ఆలస్యమైన ప్రతి రోజుకూ రూ.5000 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని తెలిపింది.

# స్కిల్ ఉంటే జపాన్, జర్మనీల్లో ఉద్యోగావకాశాలు

## మల్లేపల్లి ఎటిసి సెంటర్ ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్

హైదరాబాద్,సెప్టెంబర్27 (సమయజ్యోతి):

కేవలం సాఫ్ట్‌వేర్ కోర్సులతోనే విదేశాల్లో ఉద్యోగాలు వస్తాయని అనుకోవద్దని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఏటీసీలో శిక్షణ పొంది జర్మనీలో నెలకు రూ.3.50 లక్షలు జీతం వచ్చే ఉద్యోగాలు పొందిన వారు ఉన్నారు. చదువు, సాంకేతిక నైపుణ్యం మాత్రమే మన తలరాతను మారుస్తాయి. సాంకేతిక నైపుణ్యం లేకపోతే ఈరోజుల్లో దేనికి కొరగాని పరిస్థితి. గంజాయి కేసుల్లో అధికంగా ఇంజినీరింగ్ విద్యార్థులే దొరకడం దురదృష్టకరం. గంజాయికి బానిసలై తల్లిదండ్రులకు క్షోభ కలిగించవద్దని రేవంత్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్ నగరంలోని మల్లెపల్లి ఐటీఐ ప్రాంగణంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో 65 ఏటీసీలను వర్చువల్ గా ప్రారంభింప చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఐటీఐలను ఏటీసీలుగా ప్రభుత్వం మార్చింది.. చదవుతో పాటు- విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యం నేర్పించాలి అన్నారు. స్టూడెంట్స్‌కు చదువుతో పాటు- నైపుణ్యం కూడా అవసరం.. యువతలో నైపుణ్యాలు పెంపు కోసం టాటా సంస్థతో చర్చలు జరిపామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నైపుణ్యల కోసమే ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రూ. 2,400 కోట్ల ఖర్చు పెట్టి ఏటీసీలను అందుబాటులోకి తెచ్చాం.. సంకల్పం ఉంటే సాధ్యం కానిదంటూ ఏమీ లేదు.. టాటా సహకారంతో ఏటీ-సీలను అభివృద్ధి చేశామన్నారు. సరైన స్కిల్ ఉన్న ఉద్యోగులు దొరకడం లేదని ఆటోమొబైల్ వ్యాపారులు నాతో చెప్పారు.. త్వరలోనే మరో 53 ఏటీసీలను ఏర్పాటు చేస్తున్నాం.. భవిష్యత్ లో మొత్తం 116 ఏటీసీలనను నెలకొల్పబోతున్నామని చెప్పుకొచ్చారు. సాంకేతిక నైపుణ్యం లేకపోతే ఇంజనీరింగ్ పట్టా కూడా నాలుక గీసుకోవడానికి పనికి రాదు అని సీఎం రేవంత్ ఎద్దేవా చేశారు. సాంకేతకి నైపుణ్యం ఉంటే జపాన్,జర్మనీలు కళ్లకు అద్దుకుని తీసుకుంటున్నారని అన్నారు. అయితే, గత పాలకుల నిర్లక్ష్యంతో పదేళ్లు ఏం జరగలేదు అని సీఎం రేవంత్ పేర్కొన్నారు. కేవలం ఇంగ్లీష్ నైపుణ్యం ఉంటే సరిపోదన్నారు. రాష్ట్రం వచ్చి పదేళ్లు గడిచినా యువత ఆకాంక్షలు ఇంకా నెరవేరలేదు.. చైనా, జపాన్ లాంటి దేశాలు మన ముందు మోకరిల్లే పరిస్థితులు వస్తాయి.. చదుదు ఒక్కటే మీ తలరాతను మారుస్తుందని ఆయన తెలిపారు. కేవలం సాఫ్ట్ వేర్ కోర్సులతోనే ఉద్యోగాలు వస్తాయని అనుకోవద్దు అని సూచించారు. ఏటీసీలో చేరే ప్రతి విద్యార్థికి రూ. 2 వేల స్టయిఫండ్ ఇస్తామన్నారు. విద్యార్థులే గంజాయి వ్యాపారం చేసే పరిస్థితి వచ్చింది.. వ్యసనాల బారిన పడితే తల్లిదండ్రుల బాధను మీరు అంచనా వేయలేరని ముఖ్యమంత్రి రేవంత్ వెల్లడించారు. 2034 నాటికి తెలంగాణ 1 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా.. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు- నైపుణ్యాలు అవసరమని భావించామన్నారు. యువతలో స్కిల్స్ పెంచడం కోసం టాటా టెక్నాలజీస్‌తో చర్చలు జరిపినట్లు తెలిపారు. వారి సహకారంతో ఐటీఐలను ఏటీసీలుగా అభివృద్ధి చేసినట్లు- వివరించారు. ఆటో మొబైల్ ఇండస్ట్రీలో విస్తృతంగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి. కానీ పరిశ్రమకు అవసరమైన స్కిల్స్ యువతలో లేవు. రాష్ట్రంలో నైపుణ్యం ఉన్న ఉద్యోగులు దొరకడం లేదని ఆటోమొబైల్ వ్యాపారులు అన్నారు. రూ.2400 కోట్ల వ్యయంతో 65 ఏటీసీలను ఏర్పాటు- చేశాం. ఒక్కొక్క దాంట్లో సుమారు 200 మంది ప్రవేశాలు పొందుతున్నారు. వీటిలో శిక్షణ పొందుతున్న అందరికీ ఉద్యోగాలు లభిస్తున్నాయి. ఇదే స్ఫూర్తితో మరో 51 ఏటీసీలను మంజూరు చేస్తున్నాం. నిరుద్యోగుల పోరాటం వల్లే మనకు తెలంగాణ సాకారమైంది. రాష్ట్రం వచ్చాక పదేళ్లు గడిచినా యువత ఆకాంక్షలు





నెరవేరలేదు. మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకే అడ్వాన్స్డ్ ట్రైనింగ్ సెంటర్ , స్కిల్, స్పోర్ట్స్ యూనివర్శిటీలకు శ్రీకారం చుట్టామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. చదువు, సాంకేతిక నైపుణ్యం మాత్రమే మన తలరాతను మారుస్తాయని.. టెక్నికల్ స్కిల్స్ లేకపోతే ఈ రోజుల్లో దేనికి కొరగాని పరిస్థితి ఉందన్నారు. కార్పొరేట్ కంపెనీల్లో కూడా లేని ఎక్విప్మెంట్ ఏటీసీల్లో ఉందన్నారు. ఒక్కొ ఏటీసీలో 170 నుంచి 200 మంది జాయిన్ అవుతారని తెలిపారు. ఏటీసీల్లో - ట్రైనింగ్ తీసుకున్నవారిలో 90 శాతం మందికి మంచి వేతనంతో కూడిన ఉద్యోగాలు వస్తున్నాయని చెప్పారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే యువతకు చదువుతో పాటు- స్కిల్స్ ఉండాలని సూచించారు. నిరుద్యోగుల పోరాటం వల్లే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాకారమైందని కానీ సొంత రాష్ట్రంలో పదేళ్లు గడిచినా యువత ఆకాంక్షలు నేరవేరలేదన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, టాటా గ్రూప్ సంయుక్తంగా ఏర్పాటు- చేసిన 65 ఏటీ-సీలను సీఎం రేవంత్ రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు.

# వంటింట్లో నూనెల మంట

## పెరిగిన వంటనూనెల ధరలు

## అంతగా కనిపించని జిఎస్టీ ప్రభావం

న్యూఢిల్లీ,సెప్టెంబర్27(సమయజ్యోతి):

పండుగ సీజన్‌లో వంటనూనెలు మంటపెడుతున్నాయి. వంట చేసుకోవాలంటేనే ఆలోచించాల్సి వస్తోంది. జిఎస్టీ తగ్గి ధరలు దిగివస్తాయనుకుంటున్న వేళ వంటనూనెలు మంటపుట్టిస్తున్నాయి. దసరా, దీపావళి వంటి కీలక పండుగల సమయంలో వంట నూనెల ధరలుభారీగా పెరగడం ఆందోళనకు గురి చేసింది. లీటర్ సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్ ఏకంగా 172 రూపాయలకు చేరింది. జిఎసటీ రేట్లు తగ్గించిన సమయంలో దిగిరావాల్సిన నూనెలు మండుతున్నాయి. ఈ మధ్య కాలంలో 142 వరకు ఉన్న సన్‌ఫ్లవర్ ధర ఏకంగా 30 రూపాయలు పెరిగింది. ఇలా ఒక్కటేమిటి..అన్ని నిత్యావసర ధరలు భారీగా పెరిగాయి. వీటికి తోడు నిత్యం వాడే నూనె ధరలు పెరగడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వ అధికారిక గణాంకాల ప్రకారం, ఈ నెల రోజుల్లో ఆవనూనె ధరలు 9.10 శాతం, పామాయిల్ ధరలు 14.16 శాతం పెరిగాయి. నెల రోజుల్లో, ఆవనూనె ధర ఇటు రిటైల్ మార్కెట్‌లో అటు ఆన్‌లైన్ కిరాణా కంపెనీల పోర్టల్స్‌లో 26 శాతం పెరిగింది. నెల రోజుల క్రితం ఆన్‌లైన్ కిరాణా పోర్టల్‌లో లీటరు ఆవనూనె రూ.139 కి లభించగా, ఇప్పుడు దీని ధర లీటరుకు రూ.230 కి చేరుకుంది. అంటే గత నెలలో ధరలు 26.61 శాతం పెరిగాయి. మస్టర్డ్ ఆయిల్‌ను ఉత్తర భారతదేశంలోని చాలా ప్రాంతాల్లో వంటనూనెగా ఉపయోగిస్తారు. ప్రభుత్వ లెక్కలు కూడా ఎడిబుల్ ఆయిల్ ధరల పెరుగుదల నిజమేనని చెబుతున్నాయి. దిగుమతి సుంకాన్ని పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. దీనివల్లే వంటనూనెల దిగుమతులు ఖరీదయ్యాయి. క్రూడ్ సోయాబీన్ ఆయిల్, క్రూడ్ పామాయిల్, క్రూడ్ సన్‌ఫ్లవర్ ఆయిల్‌పై దిగుమతి సుంకాన్నిపెంచింది. ప్రభుత్వ నిర్ణయం వల్ల పామాయిల్ నుంచి సోయా వరకు అన్ని రకాల వంటనూనెల ఖరీదయ్యాయి. దేశీయ రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు దిగుమతి సుంకాన్ని పెంచినట్లు కేంద్ర ప్రభుత్వం చెప్పినప్పటికీ, రేట్ల పెంపు ప్రభావం నేరుగా సామాన్య జనంపై పడింది. నూనెలను ఎక్కువగా వినియోగించే పండుగ సీజన్‌లో, సరైన టైమ్ చూసి సర్కారు దెబ్బకొట్టింది.

# సోనమ్ వాంగ్‌చుక్ కు పాకిస్థాన్‌తో సంబంధాలు

## ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్నాం

## డీజీపీ ఎస్‌డీ సింగ్ జామ్వాల్ వెల్లడి

శ్రీనగర్,సెప్టెంబర్27(సమయజ్యోతి):

లద్దాఖ్ ఉద్యమ నేత సోనమ్ వాంగ్‌చుక్ కు పాకిస్థాన్‌తో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్నట్లు- డీజీపీ ఎస్‌డీ సింగ్ జామ్వాల్ వెల్లడించారు. లేహ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వాంగ్‌చుక్‌తో సంబంధాలు కలిగి ఉన్నట్లు- అనుమానిస్తున్న ఓ పాకిస్థానీ గూఢచారిని ఇటీవల అరెస్టు చేసినట్లు- చెప్పారు. సోనమ్ నిరసనల వీడియోలను ఆ వ్యక్తి పాకిస్థాన్‌కు పంపినట్లు- తెలిపారు. లద్దాఖ్‌లో చెలరేగిన హింస వెనుక వాంగ్‌చుక్ కీలక వ్యక్తి. ఆయన రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారు. నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంకలో చోటు-చేసుకున్న నిరసనలను ప్రస్తావించారు. ఆయన నేతృత్వంలో జరిగిన నిరసనల వీడియోలను పొరుగు దేశానికి రిపోర్ట్ చేస్తున్న ఓ పీఐవోను ఇటీ-వల అరెస్టు చేశాం. అదేవిధంగా వాంగ్‌చుక్ విదేశీ పర్యటనల్లో కొన్ని అనుమానాస్పదంగా ఉన్నాయి. పాకిస్థాన్‌లో 'ది డాన్' నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. బంగ్లాదేశ్‌నూ సందర్శించారు. వాంగ్‌చుక్ స్వచ్ఛంద సంస్థకు విదేశీ నిధులపై ప్రస్తుతం దర్యాప్తు జరుగుతోంది. కేంద్రం, లద్దాఖ్ ప్రతినిధుల మధ్య చర్చలను అడ్డుకునేందుకు ఆయన యత్నించారు. ఈ నెల 25న ఇరుపక్షాల మధ్య సమావేశం ఉందని తెలిసీ.. తన నిరాహార దీక్షను కొనసాగించారు. సమావేశానికి ఒక రోజు ముందు రెచ్చగొట్టే వీడియోలు, ప్రకటనలు చేశారు. శాంతియుత వాతావరణాన్ని దెబ్బతీసేందుకు ఉద్దేశపూర్వకంగా యత్నించారు. ఇది హింసకు, మరణాలకు దారితీసింది' అని డీజీపీ జామ్వాల్ తెలిపారు. లద్దాఖ్ హింసలో విదేశీ కుట్ర జరిగిందంటూ లెఫ్టినెంట్ గవర్నర్ కవీందర్ గుప్తా చేసిన ఆరోపణలపై డీజీపీ స్పందించారు. ఇటీ-వలి ఘటనల అనంతరం ముగ్గురు నేపాల్ పౌరులు బుల్లెట్ గాయాలతో ఆసుపత్రిలో చేరారని, మరికొందరి ప్రమేయం కూడా వెలుగులోకి వచ్చిందన్నారు. మొత్తం 50 మందిని అదుపులోకి తీసుకున్నట్లు- తెలిపారు. వారిలో దాదాపు 10-12 మందిని ప్రధాన నిందితులుగా అనుమానిస్తున్నట్టు- చెప్పారు. లద్దాఖ్‌కు రాష్ట్ర ప్రతిపత్తి కల్పించాలని, ఆ ప్రాంతాన్ని ఆరో షెడ్యూలు పరిధిలో చేర్చాలని కోరడంతో పాటు- పలు డిమాండ్ల సాధన కోసం సాగుతున్న ఉద్యమం ఇటీ-వల హింసాత్మకంగా మారిన విషయం తెలిసిందే. నలుగురు మృతిచెందగా.. 90 మంది గాయపడ్డారు. ఈ క్రమంలోనే వాంగ్‌చుక్‌ను శుక్రవారం జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) కింద అరెస్టు చేసి వేరే ప్రాంతానికి తరలించారు. ఆయన అరెస్టును కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ సహా ప్రతిపక్షాలన్నీ ఖండించాయి.

# బోయింగ్ మాజీ ఉద్యోగి బార్నెట్ మృతి

## కుటుంబంతో సెటిల్‌మెంట్ చేసుకున్న సంస్థ

న్యూయార్క్,సెప్టెంబర్27(సమయజ్యోతి):

బోయింగ్ విమానాల తయారీలో నాణ్యతా లోపాలను ఎత్తిచూపిన మాజీ ఉద్యోగి జాన్ బార్నెట్ అనుమానాస్పద మృతి అప్పట్లో సంచలనంకాగా, ఈ వ్యవహారాన్ని బోయింగ్ సెటిల్ చేసుకుంది. ఆయన మరణానికి కంపెనీ చర్యలు కారణమంటూ బార్నెట్ కుటుంబం వేసిన దావాను బోయింగ్ సెటిల్ చేసుకుంది. 50వేల డాలర్లు ఇచ్చి ఈ కేసు ముగించేందుకు అంగీకరించింది. అందులో 20వేల డాలర్లు చట్టపరమైన ఖర్చుల కింద చెల్లించనుంది. మిగిలినది కుటు-ంబ సభ్యులకు వెళ్లనుంది. బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ తయారు చేసే దక్షిణ చార్లెస్టన్ ప్లాంటులో బార్నెట్ 2010 నుంచి క్వాలిటీ- మేనేజర్‌గా పనిచేశారు. ఉద్యోగులకు కంపెనీ కొన్ని లక్ష్యాలను నిర్దేశిరచి వాటిని చేరుకోవడానికి గడువు విధిస్తోందని 2019లో ఓ ప్రముఖ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో బార్నెట్ తెలిపారు. దీని వల్ల ఒత్తిడికి గురై నాణ్యత విషయంలో ఉద్యోగులు రాజీ పడాల్సి వస్తోందని ఆరోపించారు. కొన్ని విడిభాగాలను పాత విమానాల నుంచి తీసి కొత్త వాటికి బిగిస్తున్నారని చెప్పారు. మరోవైపు 787 డ్రీమ్‌లైనర్‌లో ఆక్సిజన్ వ్యవస్థలను పరీక్షించినప్పుడు 25 శాతం విఫలమయ్యాయని తెలిపారు. ఈ విషయాన్ని మేనేజర్ల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ.. ఎలాంటి చర్యలు తీసుకోలేదని వెల్లడించారు. నాణ్యత పరమైన అంశాల్లో ఆరోపణలకు సంబంధించిన పలు కేసులు కోర్టు పరిధిలో ఉన్నాయి. వాటిలో భాగంగా గత మార్చిలో విచారణకు హాజరుకావాల్సిన బార్నెట్ హోటల్ గదిలో విగతజీవిగా కనిపించారు. ఆ అనుమానాస్పద మృతిని తర్వాత ఆత్మహత్యగా నిర్ధారించారు. దాదాపు 32 ఏళ్ల పాటు- కంపెనీలో పనిచేసిన ఆయన 2017లో అనారోగ్య కారణాలతో ఉద్యోగ విరమణ చేశారు.

# గరుడ సేవకు శ్రీవిల్లి పుత్తూరు మాలలు

## మాడవీధులగుండా ఊరేగింపుగా చేరిక

తిరుమల,సెప్టెంబర్27(సమయజ్యోతి):

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడసేవలో స్వామివారికి అలంకరించేందుకు తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూరు నుండి గోదాదేవిమాలలు శనివారం తిరుమలకు చేరుకున్నాయి. ముందుగా తిరుమలలోని శ్రీ బేడి ఆంజనేయస్వామి ఆలయం వద్ద గల శ్రీ పెద్దజీయర్ మఠానికి మాలలను తీసుకొచ్చారు. అక్కడ తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మాడవీధుల గుండా మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా గోదాదేవి మాలలను శ్రీవారి ఆలయంలోకి తీసుకెళ్లారు.ఆండాళ్ మాల - మాల అని కూడా పిలువబడే రెండు శిఖామణి దండలు పెద్ద బుట్టలలో ఉంచి, తిరుపతికి 650 కిలోమీటర్ల దూరంలో ఉన్న తమిళనాడులోని శ్రీవల్లిపుత్తూరుకు చెందిన రెండు కుటుంబాల పూల తయారీదారులు సమర్పిస్తున్నారు. శ్రీవిల్లిపుత్తూరులో గోదాదేవికి అలంకరించిన మాలలను గరుడసేవ రోజు స్వామివారికి అలంకరించడం ఆనవాయితీగా వస్తోంది. శ్రీవిల్లిపుత్తూరులోని శ్రీరంగమన్నార్‌స్వామివారి ఆలయానికి గోదాదేవి తండ్రి శ్రీపెరియాళ్వార్ పుష్ప-కైంకర్యం చేసేవారని, రంగనాథునిపై అనన్యభక్తి కలిగిన శ్రీ గోదాదేవి పూలమాలలను మొదట తాను ధరించి ఆ తరువాత స్వామివారికి పంపేవారని పురాణాల ద్వారా తెలుస్తోంది. ఈ విషయాన్ని గుర్తించిన పెరియాళ్వార్ తన కుమార్తెను మందలించారని, ఆ తరువాత గోదాదేవి ధరించకుండా పంపిన మాలలను శ్రీరంగనాథుడు తిరస్కరించారని పురాణ కథనం. గోదాదేవి శ్రీవారి దేవేరి అయిన భూదేవి అవతారమని భావిస్తారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు దేవాదాయశాఖ జాయింట్ మారియప్పన్, ఈవో చక్కరై అమ్మాళ్ శ్రీవారి ఆలయ డిప్యూటీ- ఈవో లోకనాథం, శ్రీవిల్లిపుత్తూరు ఆలయ స్థానాచార్యులు రమేష్ రంగరాజన్, తదితరులు పాల్గొన్నారు.

# ఎగువ అహెూబిలం యాగంటి ఆలయాలను దర్శించుకున్న కాకతీయ టూర్స్ టీచర్స్

సమయజ్యోతి నంద్యాల ప్రతినిధి

నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలంలోని ఎగువ అహెూబిలం పుణ్యక్షేత్రాన్ని బనగాన పల్లి మండలం రవ్వల కొండ యాగంటి లోని పురాతన ఉమా మహేశ్వర ఆలయాన్ని కొండ మీద కొలువు అయిన వెంకటేశ్వర స్వామి పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి తపస్సు చేసిన గుహలను దర్శించు కొన్నారు ఉమా మహేశ్వర ఆలయం లో స్పర్శ దర్శనం చేశారు నందవరం లోని చౌడేశ్వరి మాత ఆలయాన్ని తెలంగాణ లోని ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన కాకతీయ టూర్స్ టీచర్స్ సంఘం సందర్శించుకుని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దర్శించుకున్నారు ఈ సందర్భంగా తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామిడి సతీష్ రెడ్డి మాట్లాడుతూ అహెూబిలం లోని స్వయంభూగా వెలిసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఈ ప్రాంతంలో కొలువై ఉండడం ప్రకృతి రమణీయత మధ్య కొండల మధ్య దేవస్థానం ఉండడం శుభప్రదం అని పేర్కొన్నారు ఆలయ అధికారులు పీఠము వారు స్పందించి ఆలయాన్ని పరిశుభ్రంగా ఉంచాలని కోరారు లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులు అందరి పైన ఉండాలని భక్తులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఈ ఆలయాలను మరింతగా అభివృద్ధి చేయాలని అన్నారు శుభ్రత కూడా పాటించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు ఈ కమిటీ లో తంగేళ్ల రాజిరెడ్డి కుంభం తిరుపతిరెడ్డి మారం దేవేందర్ రెడ్డి భూక్య బాబూ రావు వొల్లాల అశోక్ గౌడ్ కామిడి శ్రీధర్ రెడ్డి రావుల సంపత్ రెడ్డి లింగంపల్లి నర్సింగారావు బండి రాజేంద్ర ప్రసాద్ తదితరులు ఆలయాల సందర్శన లో పాలుపంచుకున్నారు



# బంతి పువ్వుల పంట తో అధిక లాభాలు

సమయజ్యోతి న్యూస్ సెప్టెంబర్ 27 బజార్ హత్నూర్

బజార్ హత్నూర్ మండల కేంద్రానికి చెందిన రైతు కన్నిందే వినోద్ తన ఉన్న రెండు ఎకరాల భూమిలో బంతి మిర్చి పంట వేసి పండుగ సీజను అనుగుణంగా బంతి పువ్వుల కోతకు వస్తున్నాయి ప్రస్తుతం బతుకమ్మ పండుగ సీజన్ కాబట్టి బంతి పువ్వుల కు డిమాండ్ ఎక్కువగా ఉంటుందని అని రైతు వినోద్ తెలిపారు కిలో బంతి మార్కెట్లో 80 నుండి 100 రూపాయలు వరకు ఉంటుంది రైతు తెలిపారు



# అంగన్వాడి టీచర్లు ఆయాలకు ఏకరూప చీరల పంపిణీ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని బాలింతలకు గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం ప్రాధాన్యతను తెలియజేస్తూ వారి ఆరోగ్య పరిరక్షణలో అంగన్వాడీల సేవలు ప్రశంసనీయమని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు శనివారం సాయంత్రం పటాన్చెరు క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అంగన్వాడి శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలోని 170 అంగన్వాడి సెంటర్లలో విధులు నిర్వర్తిస్తున్న 170 మంది టీచర్లు 170 మంది ఆయాలకు రెండు జతల చొప్పున చీరలను ఎమ్మెల్యే జిఎంఆర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు నియోజకవర్గంలో అంగన్వాడీ కార్యకర్తల సంక్షేమానికి కృషి చేస్తున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో రామచంద్రపురం మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్ ఐసిడిఎస్ సిడిపిఓ జయరాం నాయక్ సిబ్బంది మహిళలు పాల్గొన్నారు



# కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలు కొనసాగిస్తాం

## ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం

తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం అలుపెరుగని పోరాటం చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కొనసాగిస్తామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు శనివారం పటాన్చెరు పట్టణంలోని శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ కాంస్య విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన బాపూజీ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఘన నివాళులు అర్పించారు ఈ కార్యక్రమంలో పటాన్చెరు కార్పోరేటర్ మెట్టు కుమార్ యాదవ్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వంగరి అశోక్ కంకర సీనయ్య వెంకటేష్ పద్మశాలి సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు




# కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నివాళులర్పించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

సమయజ్యోతి న్యూస్ సెప్టెంబర్ 27 బజార్ హత్నూర్

స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ మంత్రి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 110 వ జయంతి సందర్భంగా బోథ్ మండలంలోని దన్నూర్ బి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ అడుగుజాడల్లో నడవాలని ఆయనలో ఉన్న ఉద్యమ స్ఫూర్తిని అందరం తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



# అధిక వర్షాలకు సోయాచిక్కుడు పంటకు నష్టం

సమయజ్యోతి న్యూస్ సెప్టెంబర్ 27 బజార్ హత్నూర్

ఆదిలాబాద్ జిల్లా అధిక సంఖ్యలో రైతులు సోయా చిక్కుడు కాయలు అధిక వర్షాలకు కూలిపోవడం వల్ల పంట దిగుబడి తగ్గే అవకాశం ఉంది అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు అధిక వర్షాల వల్ల పత్తి పంట కూడా నష్టం జరిగింది పత్తికాయలు అధిక వర్షాలకు కుళ్లిపోయాయి పూత నకిరే రాలిపోవడం వల్ల పత్తి పంట కూడా ఆశించిన దిగుబడి వచ్చే అవకాశం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఈ పంట కాలంలో అన్ని పంటలకు అధిక వర్షాల వల్ల నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ప్రభుత్వం ఇకనైనా నష్టపరిహారం చెల్లించలీ ఇన్సూరెన్స్ చెల్లించి రైతులను ఆదుకోవాలని అన్నదాత వాపోతున్నారు సంబంధిత అధికారులు సర్వే చేసి రైతులకు నష్ట నివారణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు



# మూడు కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

## పటాన్చెరు ఎమ్మెల్యే జీ ఎం ఆర్

సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం

శనివారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ సీతారామపురం కాలనీ శాంతినగర్ కాలనీ గౌతమ్ నగర్ కాలనీ కృషి డిఫెన్స్ కాలనీలలో మూడు కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్లు బీటి రోడ్డు వరద నీటి కాలువల నిర్మాణ పనులకు శనివారం శంకుస్థాపన చేసినట్లు పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు ఈ కార్యక్రమంలో పటాన్చెరు కార్పోరేటర్ మెట్టు కుమార్ యాదవ్ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



# అనాథ శవానికి గ్రామస్తులు అంత్యక్రియలు

సమయజ్యోతి న్యూస్ కృష్ణ.... నారాయణ పేట జిల్లా

మండల కేంద్రంలోని అనాథ శవానికి గ్రామస్తులు అంతిమ సంస్కారాలు చేశారు, శనివారం మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ లో బిక్షటన చేసుకుంటు గత మూడు సంవత్సరాల నుండి కృష్ణ గ్రామంలో నివాసిస్తున్న ఈశ (45) సంవత్సరాలు అనే వ్యక్తి గత కొన్ని నెలల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మరణించాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న గ్రామస్తులు మరియు పోలీస్ కలిసి మృతదేహానికి అంతిమ సంస్కారాలు చేశారు,



# గ్రామపంచాయతీ కార్మికుల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలి: రాష్ట్ర అధ్యక్షులు దాసు

సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్ బ్యూరో

గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ ఆదర్శ గ్రామపంచాయతీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎంపీడీవోల ద్వారా ప్రభుత్వాన్ని కోరుతూ వినతి పత్రాలు అందజేసినట్లుగా ఆలూరు కేంద్రంలో శనివారం రాష్ట్ర అధ్యక్షులు దాసు ఒక ప్రకటనలో తెలిపారు. బతుకమ్మ దసరా పండుగలు పురస్కరించుకొని మల్టీపర్పస్ వర్కర్ల బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని, వారి ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తెలంగాణ ఆదర్శ గ్రామపంచాయతీ నిజామాబాద్ జిల్లాకార్యదర్శి అబ్దుల్, ఐఎఫ్టియు జిల్లా నాయకులు బాలయ్య, నాయకులు మచర్ల గంగాధర్, లక్ష్మణ్, శంకర్, పి వై ఎల్ సంజీవ్ పాల్గొన్నారు.




# మున్సిపల్ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి మందమర్రి

స్వాతంత్ర సమరయోధుడు తెలంగాణ సాయుధ పోరాట వీరుడు తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తన మంత్రి పదవికి కూడా రాజీనామా చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి నీ మందమర్రి మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ తుంగపిండి రాజలింగు కార్యాలయ సిబ్బందితో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరంకుశ నిజాం వ్యతిరేక, తెలంగాణ ఉద్యమ నాయకులలో ప్రముఖుడైన కొండా లక్ష్మణ్ బాపూజీ కొమరంభీం జిల్లా, వాంకిడి గ్రామంలో జన్మించాడు తెలిపారు. స్వాతంత్ర్యోద్యమంలో, నిరంకుశ నిజాం వ్యతిరేక ఉద్యమంలోనూ చురుకుగా పాల్గొన్నారని అన్నారు. పాల్గొన్నాడు. ఈనాటి యువత ఇలాంటి మేధావులను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది బంగారి శ్రీనివాస్, ఎంఎ సమీర్, ఎం కుమార స్వామి, ఎం గోపికృష్ణ, ఏ రఘురాం, వార్డు ఆఫీసర్స్ గంగిపల్లి శ్రీజ, ఏ శిరీష్, బి శ్యాంబాబు, వి ప్రభాకర్ రెడ్డి, తగురం రవి, అవునూరి శంకర్, సిలిముల భాను బిరుదుల అరుణ తదితరులు పాల్గొన్నారు.




GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/5332
సమయజ్యోతి
ప్రతీ అక్షరం - ప్రజలకోసం

## సంపాదకీయం

# మూసీ విశ్వరూపం!

ఈ నగరానికి ఏమయ్యింది...ఎందుకిలా వణుకుతోంది. హైదరాబాద్ పరిస్థితి ఇంత దారుణంగా తయారు కావడానికి కారణం ఎవరు. మూసీ ఉప్పొంగడంతో కాలనీలు అన్నీ నీట మునిగాయి. మూసీ పరివాహకం ఉప్పొంగి ప్రవహిస్తోంది. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్ వద్ద మూసీ ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. మూసీలో నీటి ప్రవాహం కొనసాగుతుండటంతో ఎంజీబీఎస్ ప్రాంగణంలోకి భారీగా వరద చేరింది. బస్టాండ్ పరిసర ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి. దీంతో ఇక్కడి నుంచి బస్సుల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. శుక్రవారం కురిసిన వర్షానికి ముసారాంబాగ్, చాదర్‌ఘాట్ వంతెనలపై నుంచి మూసీ ఉప్పొంగి ప్రవహిస్తోంది. మూసీ పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. ఇకపోతే నిరంతరాయంగా మూసీ ప్రవహిస్తే హైదరాబాద్‌కు కళ వస్తుంది. నగరం మధ్యలో నది ప్రవహిస్తే ఎంత సుందరంగా ఉంటుందో ఇప్పుడు కళ్లకు కనిపిస్తోంది. వరుసగా కొన్నిరోజుల నుంచి కురుస్తున్న వానల కారణంగా మూసీ ఉప్పొంగుతోంది. ఇప్పుడే హైడ్రా ఎందుకన్న చర్చ జరగాలి. మూసీ ప్రక్షాళన ఎందుకన్న చర్చ జరగాలి.ఎక్కడిక్కడ ఆక్రమణల కారణంగా హైదరాబాద్‌లో నాలాలు ఉప్పొంగు తున్నాయి. హైదరాబాద్ రోడ్లు వాగులను తలపిస్తున్నాయి. ఇప్పుడు మూసీ ఉధృతితో చుట్టుపక్కల ఆక్రమణలు కొట్టుకు పోయాయి. హైడ్రా దాడులతో అనేక మంచి పనులు జరిగాయి. ఆక్రమణల చెరవీడుతోంది. బతుకమ్మకుంట కొంతయినా కళ సంతరించుకుంది. నాలాలపై ఆక్రమణలు తొలగించి డ్రైనేజీ వ్యవస్థను బాగుచేయాల్సి ఉంది. హైడ్రా ఎంతగా దూకుడు ప్రదర్శిస్తే ప్రభుత్వంపై అంతగా వ్యతిరేకత వస్తుందన్న భావనలో బిజెపి, బిఆర్ఎస్ రెండు పార్టీలు ఉన్నాయి. అందుకే పేదలకు మద్దతుగా మాట్లాడుతున్నాయి. అగ్గి రాజేసేలా మాట్లాడుతున్నాయి. ఎక్కడ లేని మొసలి కన్నీరు కారుస్తున్నాయి. ప్రజలు తిరుగుబాటు చేయాలని కోరుకుంటున్నాయి. ఆక్రమణలు కూల్చాల్సిందే అని ఆనాడు కెసిఆర్ గట్టిగానే అన్నారు. దీనికి సమాధానం చెప్పాలని మరోవైపు కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. మొత్తంగా ఎవరికి వారు రాజకీయ కోణంలో తమకు లాభమా కాదా అనన ధోరణిలో మాట్లాడుతున్నారు. హైదరాబాద్‌లో దశాబ్దాలుగా మూసీ ఆక్రమణలు జరిగాయి. ఓ నది కాస్తా.. చిన్న మురికి కాలువగా మారిపోయింది. ఇప్పుడు అది ఎలా ఉండేదో తాజా వరదలతో స్పష్టంగా తెలుస్తోంది. మూసీ ప్రవాహంతో అందులో ఉన్న వారు బయటకు రాక తప్పలేదు. అక్కడి నిర్వాసితులకు నష్టపరిహారం...పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని నిర్ణయించారు. అయినా అక్కడ కూల్చివేతల వల్ల జరిగే నెగెటివ్ ప్రచారం అంతా ఇంతా కాదు. అయినప్పటికీ రేవంత్ రెడ్డి ఏ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. అయితే అందరికన్నా బిఆర్ఎస్ రాజకీయ లబ్ది పొందేలా చూస్తున్నది. వివిధ అంశాలపై ఎదురుదాడి చేయడం ద్వారా తమపై వచ్చిన అవినీతి, అక్రమాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోంది. హైడ్రాతో రేవంత్‌రెడ్డికి చెడ్డపేరు వస్తుందని, అది తమకు కలసి వస్తుందని భావిస్తోంది. అందుకే రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఇప్పుడు విపక్ష బీఆర్ఎస్ ఏకపక్ష దాడి చేస్తోంది. కూల్చివేతల కారణంగా ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే స్థాయికి వచ్చారని అంటున్నారు. అయితే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ విషయంలో ఏ మాత్రం తగ్గడం లేదు. తదుపరి మూసీ పరివాహక ప్రాంతాన్ని టార్గెట్ గా పెట్టుకుంది. అయితే చాలా కాలంగా మూసీని ఆక్రమించుకుని ఉంటున్నారు కాబట్టి వరదలు వస్తే ఏమిటో ఇప్పుడు తెలిసి వస్తోంది. విపక్షాలు రాజకీయం చేయకుండా మూసీ ప్రవాహాలను చూడాలి. మూసారాం బాగ్ బ్రిడ్జి మూసేసారు. చాదర్‌ఘాట్ బ్రిడ్జి మూసేసారు. మూసీ ఉప్పొంగడంతో పలుచోట్ల రాకపోకలునిలిచి పోయాయి. అందుకే హైడ్రా తీసుకుంటున్న నిర్ణయాలు, అమలు చేస్తున్న కార్యక్రమాల వల్ల ఉపయోగం ఏమిటో ప్రజలకు ఖచ్చితంగా తెలుసని ధీమాగా ఉన్నారు. నిజంగా మూసీ పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసి.. అనుకున్న విధంగా ప్రాజెక్టును పట్టాలెక్కిస్తే.. రివర్ సిటీగా హైదరాబాద్ మారిపోతుంది. బ్యూటిఫుల్ లుక్ వస్తుంది. చెరువులు, నాలాల ఆక్రమణలు లేకపోతే.. ఎంత వర్షం పడినా ముంపు ఉండదు. ఐదేళ్ల కిందట హైదరాబాద్‌లో అతి భారీ వర్షం కురిసింది. ఎంత అంటే.. ఎప్పుడూ నీళ్లు చూడని రోడ్లు కూడా నదుల్లా పారాయి. పదుల సంఖ్యలో జనం కొట్టుకుపోయారు. హైదరాబాద్‌లోని సగం ఇళ్లు నీట మునిగాయి. అంత వరద వందేళ్లలో రాలేదని అప్పటి ప్రభుత్వం చెప్పింది. నాలాలు కబ్జాకు గురయ్యాయని.. చెరువుల్ని కబ్జా చేశారని అన్నింటినీ క్లియర్ చేసి..మరోసారి అలాంటి పరిస్థితి రాకుండా చూస్తామని ప్రకటించారు. ఇప్పుడు అంతకుమించి వర్షం పడింది. మూసీ గర్జిస్తోంది. హైదరాబాద్ అంతటా రోడ్లు వాగుల్లా మారుతున్నాయి. గతేడాది వరదల కారణంగా ఖమ్మం, విజయవాడ ప్రజలు ఎంతగా నష్టపోయారో చూశాం. అలాంటి పరిస్థితి హైదరాబాద్‌కు రాకుండా చూసుకోవాలి. ఖచ్చితంగా చెరువుల్ని.. నాలాల్ని.. కాపాడుకోవాలని ప్రజలు కూడా కోరుకుంటున్నారు. దీని వల్ల ప్రభుత్వానికి మద్దతు లభిస్తోంది.

# నవ యుగ కవి చక్రవర్తి గుఱ్ఱం జాషువా జయంతి. (సెప్టెంబరు 28)




ఆధునిక కవుల్లో అనితర సాధ్యమైన స్థానం జాషువా ది. విశ్వమానవుడను నేను అని చెప్పుకున్న ఈ కవి 1896 సెప్టెంబర్ 28 న వినుకొండ గుంటూరు జిల్లా లోని మిస్సమ్మ తోటలో జన్మించారు. తండ్రి వీరయ్య తల్లి లింగమాంబ. జాషువా కి ఇజ్రాయెల్ అనే సోదరుడు ఉన్నాడు. బాల్యం అంతా దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించిన జాషువా చిన్నతనం నుండి కవిత్వం పై ఆసక్తితో పలువురు కవులు, రచయితలు, పండితులతో పరిచయం పెంచుకున్నారు. జూపూడి హనుమచ్ఛాస్త్రి, అవధాని కొప్పరపు సుబ్బారావు వంటి వారి మన్నలను పొందారు. 1910 లో మేరీ తో ఈయనకు బాల్య వివాహం జరిగింది. రాజమండ్రీ వెళ్లిన జాషువా కు, కందుకూరి చిలకమర్తి గార్ల పరిచయం ఏర్పడింది. తన జీవితాన్ని సాహిత్యానికే అంకితం చేసిన కవి జాషువా, పౌరాణిక సాహిత్యం, అనాథ స్వప్న కథ, ముంతాజ్ మహల్, ఫిరదౌసి, శిశువు, సాలీడు వంటి ఎన్నో రచనలు చేశారు. అభ్యుదయ భావజాలంతో గబ్బిలము, కాంది శీకుడు, నేతాజీ, బాపూజీ, స్వయంవరం అనే కావ్యాలు అసంఖ్యాకంగా ఎన్నో ఖండ కావ్యాలు, క్రొత్త లోకం, ముసాఫరులు, క్రీస్తు చరిత్ర ఇతర ఖండికలు రాశారు. క్రీస్తు చరిత్ర కావ్యానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. తన సాహిత్య తపస్సును అణగారిన వారి శ్రేయస్సుకే అంకితం చేసిన జాషువా రచనలలో అభ్యుదయ భావాలు మెండుగా కనిపించేవి గజారోహణం, పౌర సన్మానాలు, గండ పెండేరాలు, పద్మ భూషణ పురస్కారం అనేక బిరుదులు, ప్రశంసలు పొందిన మహాకవి జాషువా. అభ్యుదయ భావజాలానికి సామాజిక ఆచరణ కి ఉన్న అనుబంధం అవగాహన పరిధిలోనికి వచ్చేసరికి జాషువా దృక్పథంలో విప్లవాత్మకమైన మార్పు అయన రచనల్లో కనిపిస్తుంది.

స్వర్గ నరకాలు రెండు నీ జగతి యందు
నరుడు సృష్టించగలడని నమ్మగలను
మనిషిని మనిషిగా చూడలేని సమాజ నీతి నియమాలు మీద తన సమాజ స్థాపన కోసం తన సాహిత్యాన్ని సాధన చేసుకున్న జాషువా.

రాజు మరనించెనొక తార గగనమెక్కె
కవియు మరణించె నొక తార గగనమెక్కె
రాజు జీవించె రాతి విగ్రహములందు.
సుకవి జీవించె ప్రజల నాలుకల యందు.

అయన కీర్తి శాశ్వతం అనడానికి ఈ పద్యం ఒకటి ఉదాహరణ గా చాలు. గుఱ్ఱం జాషువా ఏ వర్గం వారికో, ఏ జాతి వారికో చెందిన వాటిని కానని తాను విశ్వ నరుడనని గర్వంగా చెప్పారు. ప్రగతి శీల భావజాలంతో ముధా చరాలపై తన కవిత్వాన్ని ఎక్కుపెట్టాడు. అలుపెరుగని పోరాటం చేసిన ఈ సుకవి 1971 జూలై 24 న గుంటూరులో కన్నుమూశారు.

డా జొన్న కూటి ప్రమోద్ కుమార్
9490833108

# అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ల ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నెలకొల్పిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో నైపుణ్యంతో కూడిన శిక్షణ పొందడం ద్వారా యువతకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు లభిస్తాయని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అందుబాటులోకి తెచ్చిన 65 అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను శనివారం హైదరాబాద్ లోని మల్లెపల్లి ఏ.టీ.సీ సెంటర్ నుండి మంత్రులు జి.వివేక్ వెంకటస్వామి,డి.శ్రీధర్ బాబు,పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తదితరులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్చువల్ విధానం ద్వారా లాంచనంగా ప్రారంభోత్సవాలు చేశారు.ఇందులో భాగంగానే ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐ.టీ.ఐ) ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏ.టీ.సీ కేంద్రాలను కలెక్టర్ గ్రంథాలయ ఛైర్మెన్ మల్లెపూల నర్సయ్య,గోవర్ధన్ రెడ్డి లతో కలిసి ప్రారంభించారు.ఏ.టీ.సీ కేంద్రాలలో వివిధ కోర్సులలో శిక్షణ అందించేందుకు వీలుగా నెలకొల్పిన ఆధునిక యంత్రాలను పరిశీలించి మాట్లాడుతూ,ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా, సరికొత్త సాంకేతికత అంశాలతో యువతలో నైపుణ్యాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఏ.టీ.సీ కేంద్రాలను ఏర్పాటు చేసిందని అన్నారు.అదే సమయంలో పారిశ్రామిక అవసరాలకు నైపుణ్యం కలిగిన అభ్యర్థులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఏ.టీ.సీ సెంటర్ కు రూ.4.70 కోట్ల నిధులను ఖర్చు చేశారని వివరించారు. మొదటి ఏడాది ఆరు కోర్సులలో శిక్షణ అందించడం జరుగుతోందని, క్రమక్రమంగా మార్కెట్ డిమాండ్ ఉన్న మరిన్ని ఆధునిక కోర్సులలో శిక్షణ అందించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని అన్నారు.టాటా కన్సల్టెన్సీ సంస్థతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుని ఏ.టీ.సీ కేంద్రాలలో శిక్షణ ఇప్పిస్తోందని,దీని వల్ల విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ప్లేస్ మెంట్ ఉంటుందని,ఈ అవకాశాన్ని





యువతీ,యువకులు,విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధి కల్పన అధికారి మిల్కా,ఐటీఐ ప్రిన్సిపల్ పి. శ్రీనివాస్, ముత్యం రెడ్డి,ఏ.టీ.సీ కేంద్రాల ప్రిన్సిపాల్స్,ఇన్ స్ట్రక్టర్లు,శిక్షణ పొందుతున్న అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

## జిల్లా డీఎస్పీ నల్లపు లింగయ్య






**సమయజ్యోతి న్యూస్ కృష్ణ.... నారాయణ పేట జిల్లా**

పోలీస్ ఉద్యోగం ఎంతో బాధ్యతాయుతమైందని విధి నిర్వహణలో ప్రతి ఒక్కరు ప్రజల మన్ననలు పొందుతూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని డీఎస్పీ నల్లపు లింగయ్య అన్నారు.వార్షిక తనిఖీల్లో భాగంగా నారాయణపేట జిల్లా డిఎస్పి నల్లపు లింగయ్య శనివారం రోజు కృష్ణ పోలీస్ స్టేషన్ ను తనిఖీ నిర్వహించారు. ముందుగా మక్తల్ సీఐ రామ్ లాల్, ఎస్సై నవీద్ లు కలిసి డిఎస్పికు పూల మొక్క అందించి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా డిఎస్పి పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి,పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులకు తెలిపారు. పోలీస్ స్టేషన్ లోని రికార్డులు, పెండింగ్ కేసులు, కేసుల దర్యాప్తు, సిబ్బంది పనితీరు మొదలైన వాటినీ పరిశీలించారు.కృష్ణ పోలీస్ స్టేషన్ సిబ్బంది అందరితో ప్రత్యేకంగా మాట్లాడిన డిఎస్పీ ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించే విధంగా మరింత కృషి చేయాలని, పిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలని సూచించారు. చట్ట ప్రకారం సమయానికి కేసుల పరిష్కారం ప్రజలకు మెరుగైన సేవలందించడంలో కృషి చేయాలని సూచించారు,శాంతి భద్రతల పరిరక్షణ నేరాల నియంత్రణలో నూతన పద్ధతులు ఆలంబించాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ యూనిఫామ్ నిట్ టర్నవట్ ఉండాలని, క్రమశిక్షణ, సమయపాలన పాటించాలని సూచించారు. సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉంటే ఎస్పీ దృష్టిలో ఉంచి వాటిని పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం పోలీసు అధికారులు సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ తనిఖీల్లో మక్తల్ సీఐ రామ్ లాల్, ఎస్సై నవీద్, పోలీసు సిబంది పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ల ఖరారు కలెక్టరేట్ లో లక్కీ డ్రా

**సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో సెప్టెంబర్ 27.**

నిర్మల్ జిల్లాలో నిర్వహించబోయే స్థానిక సంస్థల ఎన్నికల స్థానాల రిజర్వేషన్ల ఖరారుకు శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో లక్కీ డ్రా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ, ఎం.పి.పి., ఎం.పి.టి.సి., సర్పంచ్ స్థానాలకు ఎస్.సి., ఎస్.టి., బి.సి., మహిళా, జనరల్ రిజర్వేషన్లను ఖరారు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పూర్తిస్థాయి పారదర్శకతతో రిజర్వేషన్ ప్రక్రియ జరిపామని తెలిపారు. జిల్లాలోని 18 జెడ్పీటీసీ, ఎం.పి.పి. స్థానాల రిజర్వేషన్లను 2011 జనాభా ప్రాతిపదికన ఎస్.సి., ఎస్.టి. వాటాలను నిర్ణయించగా, బి.సి. రిజర్వేషన్లను రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనల ప్రకారం కేటాయించామన్నారు. మొత్తం ప్రక్రియ వీడియో రికార్డింగ్ మధ్యన, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పూర్తిగా నిబంధనలకు అనుగుణంగా కొనసాగిందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ లక్కీ డ్రా కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, జెడ్పీ సీఈవో గోవింద్, డిప్యూటీ సీఈవో శంకర్ తదితరులు పాల్గొన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో హాజరై రిజర్వేషన్ల ఖరారును పరిశీలించారు.



# కలెక్టరేట్ లో ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

**సమయ జ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో సెప్టెంబర్ 27.**


కలెక్టరేట్లో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలువురు అధికారులు కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, కొండా లక్ష్మణ్ బాపూజీ గొప్పతనాన్ని వివరించారు. భారత స్వాతంత్రం ఉద్యమం, నిజాం వ్యతిరేఖ, ప్రత్యేక తెలంగాణ ఉద్యమాలలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందినవాడు కావడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. వృద్ధాప్యంలో కూడా ప్రత్యేక తెలంగాణ కోసం పోరాడిన గొప్ప ఉద్యమకారుడు అని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వివిధ కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# సమాచార హక్కు చట్టం కమిషనర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన - ఆర్టీఐ వికాస సమితి జిల్లా అధ్యక్షుడు ఎల్లుల సంతోష్

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

సమాచార హక్కు చట్టం కమిషనర్ దేశాల భూపాల్ ను శనివారం హైదరాబాద్ లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించిన ఆదిలాబాద్ సమాచార హక్కు వికాస సమితి అధ్యక్షుడు ఎల్లుల సంతోష్.ఏ సంతోష్ మాట్లాడుతూ ప్రగతి,ప్రజా సంక్షేమం కోసం,పారదర్శక పాలన, జవాబుదారీ తనం పెంపు కోసం సమాచార హక్కు చట్టం పై ప్రజలందరూ అవగాహన కలిగి వుండాలని సమాచార హక్కు చట్టం కమిషనర్ దేశాల భూపాల్ అన్నారని చెప్పారు.ప్రతి పౌరుడు సమాచార హక్కు చట్టం పై అవగాహన పెంచుకోవడం ద్వారా తమ సమస్యలను వరిష్కరించుకుంటూ,ప్రజాధనం దుర్వినియోగం కాకుండా,ప్రగతి పనుల్లో నాణ్యత పెంపు కోసం నిరంతరం నిఘా వుంచే బాధ్యత పౌరులందరిది అని,ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు పూర్తి ఆధారాలను ప్రజలు కోరినప్పుడు చూపాలని,ఈ చట్టం ప్రజాస్వామ్యం విజయవంతం కావడానికి,ప్రజలను యజమానులు చేసిన సమాచార హక్కు చట్టాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారన్నారు.సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ యర్ర మాధ కృష్ణారెడ్డి గారి ఆధ్వర్యంలో శనివారం సమాచార హక్కు కమిషన్ కార్యాలయంలో కమిషనర్ దేశాల భూపాల్ గారిని కలిసిశాలువాతో సమాచార హక్కు వికాస సమితి అదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎల్లుల సంతోష్ కుమార్ సన్మానం చేసినట్లు తెలిపారు.జిల్లాలో సమాచార హక్కు చట్టం పై చేస్తున్న సేవలను,ప్రచారాన్ని అభినందిస్తూ సమాచార హక్కు చట్టం పుస్తకాన్ని ఎల్లుల సంతోష్ కుమార్ కు డి భూపాల్ ఆర్టీఐ బుక్కు బహుకరిస్తూ,ఆదిలాబాద్ జిల్లా ఆర్టీఐ మానిటరింగ్ కమిటీ లో సభ్యునిగా నియమించే విధముగా జిల్లా అధికారులకు సిఫారసు చేస్తానని హామీ ఇచ్చారని చెప్పారు.బహుకరించిన ఆర్టీఐ బుక్కు లోని ఆర్టీఐ చెట్టాలు,సెక్షన్లు,నిబంధనలను తెలుసుకొని అనుసరించాలని సూచించారని,త్వరలో తెలంగాణ రాష్ట్రం లోని అన్ని జిల్లాల పర్యటనలు పూర్తి అవుతాయని,అన్ని జిల్లాల్లో ఆర్టీఐ మానిటరింగ్ కమిటీ సభ్యుల నియామకం పూర్తి చెయ్యాలని కమీషనర్ ఆదేశాలు జారీ చేశారన్నారు.కమిషనర్ చేతుల మీదుగా సమాచార హక్కు చట్టం పుస్తకాన్ని తీసుకోవడం ఎంతో సంతోషాన్ని కలిగించిందని అన్నారు.



# గంగ నీళ్ళ జాతరకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

## జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల

**సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో సెప్టెంబర్ 27.**

నిర్మల్ జిల్లా ప్రసిద్ధ ఆధ్యాత్మిక క్షేత్రాలలో ఒకటైన ఆడెల్లి పోచమ్మ దేవస్థానంలో ప్రతీ ఏటా జరిగే గంగ నీళ్ళ జాతరకు ఈసారి కూడా ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ తెలిపారు. ఈ రోజు ప్రారంభమయ్యే అమ్మవారి ఆభరణాల శుద్ధి కార్యక్రమం, సారంగాపూర్ %-% దిలావార్పూర్ %-% ముజ్గి మీదుగా సాంగ్వి గ్రామ శివారులో గల పోచమ్మ గుడి వద్ద గోదావరి జలాలతో ఆభరణాలను పవిత్రం చేయడం ద్వారా ఆచరించబడనుంది. అనంతరం రేపు తెల్లవారుజామున ఆభరణాలు ఘనంగా, మంగళ వాయిద్యాల నడుమ అదేల్లి పోచమ్మ దేవస్థానానికి తరలించబడతాయి.

**ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ..**

"భక్తులు, యాత్రికులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. కావున ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఆభరణాల శుద్ధి నుండి దేవస్థానం చేరే వరకు ప్రతి దశలో భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా అమలు చేయాలి" అని ఆదేశాలు జారీ చేశారు.

గోదావరి ఘాట్ వద్ద వరద నీరు ఎక్కువగా ఉంది కనుక పటిష్ట మైన బారికేడ్ల ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆ బారికేడ్ల వద్దకు ఎక్కువగా భక్తులు రాకుండా చూసుకోవాలని కమిటీ వారికి సూచించారు. ఎస్పీ సూచనల మేరకు.. జాతర ప్రాంగణం, ప్రధాన రహదారులు, గుడి పరిసర ప్రాంతాలలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించనున్నారు. సీసీ కెమెరాలు, పెట్రోలింగ్ వాహనాలు, చెక్ పోస్టులు ఏర్పాటు చేసి భద్రతను పర్యవేక్షిస్తారు. ఆభరణాలు తరలించే మార్గంలో ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్ సౌకర్యం, అత్యవసర వైద్య సహాయం వంటి చర్యలు కూడా అమలు చేస్తున్నారు.





# శ్రీ లలిత త్రిపుర సుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన కాళికాదేవి.

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిది**

**. అమరచింత వనపర్తి జిల్లా.**

అమరచింత పట్టణంలోని శ్రీ కృష్ణా నగర్ లో వెలసిన శ్రీశ్రీశ్రీ కాళికాదేవి దేవాలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆరవ రోజు శ్రీ లలిత త్రిపుర సుందరి దేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇవ్వడం జరిగినది.

# 10 వ తరగతి పాసైన ప్రతి విద్యార్థికి అపూర్వ అవకాశం కార్పోరేటర్ పుష్పా నగేష్

**సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం**

రామచంద్రాపురం డివిజన్ మయూరి నగర్ కాలనీ ప్రభుత్వ ఐటిఐ లో ప్రవేశ పెట్టిన నూతన కోర్సులు పదవ తరగతి పాసైన ప్రతి విద్యార్థికి ఒక అపూర్వమైన అవకాశం అని రామచంద్రాపురం కార్పోరేటర్ పుష్పా నగేష్ అన్నారు శనివారం ప్రభుత్వ ఐటిఐ లో నూతన కోర్సులు అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లను స్థానిక రామచంద్రాపురం కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేష్ ప్రారంభించి సిఎన్సి మెషిన్ ను ఆన్ చేశారు ఐటిఐ ఆవరణలో టాటా సంస్థ ఆధ్వర్యంలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ఏటీసీ లో విద్యార్థులకు అందిస్తున్న కోర్సులను అడిగి తెలుసుకున్న ఆమె మాట్లాడుతూ ప్రధానంగా ప్రస్తుత మార్కెట్లో డిమాండ్ ఉన్న ఆరు కోర్సులను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకుని రావడం సంతోషం అని అన్నారు ఎలక్ట్రికల్ వెహికల్ (ఈవి) రిపేరింగ్ అడ్వాన్స్ సిఎంసి మిషన్ ఇండస్ట్రియల్ మ్యానుఫ్యాక్చరింగ్ అండ్ రోబోటిక్ ఆర్టిసియన్ యూజ్డ్ అడ్వాన్స్ టూల్స్ కోర్స్ బేసిక్ డిజైన్ అండ్ వర్చువల్ వెరిఫైయర్ కోర్స్ ఉత్పత్తుల రంగంలో ఉండే వివిధ ఎలక్ట్రానిక్ పరికరాల మరమ్మతుల అంశాల్లో కోర్సులు ప్రవేశపెట్టారని తెలిపారు పదవ తరగతి పాసైన ప్రతి విద్యార్థి ఈ కోర్సులు చేయడానికి అర్హులని తెలిపారు ప్రతి సంవత్సరం పైన పేర్కొన 6 కోర్సుల్లో 240 మంది విద్యార్థులు చదువుకోవచ్చని తెలిపారు ప్రిన్సిపాల్ వీరమల్లేష్ ఐటిఐ సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు



# తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ

**సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్ బ్యూరో**

తెలంగాణ ఉద్యమంలో ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ కీలక పాత్ర పోషించారని రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డితో కలిసి నిజామాబాద్ జిల్లా కేంద్రం వినాయక్ నగర్లో కొండ లక్ష్మణ్ బాపూజీ 110వ జయంతి వేడుకల్లో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొని స్వాతంత్రం కోసం ఎంతో కృషి చేశారని, తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించడానికి మంత్రి పదవిని త్యాగం చేశారని, లక్ష్మణ్ బాపూజీ ఆలోచన మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తుందని, బీసీలకు రిజర్వేషన్ ఇచ్చే ఎలక్షన్ నిర్వహిస్తామని, కాంగ్రెస్ పార్టీ నిబద్ధతో పని చేస్తుందని అన్నారు. యువత కొండ లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు.



# రహదారి అభివృద్ధి కోసం వినయ్ కుమార్ రెడ్డికి నాయకుల వినతి

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి ఆర్మూర్ టౌన్**

ఆర్మూర్ నియోజకవర్గంలోని సుబ్రియాల్, ఫతేపూర్, పిప్రి, మగ్గిడి ఖానాపూర్, అమాదాపూర్ గ్రామాలను కలుపుతూ ఫతేపూర్ టూ అమ్దాపూర్ మూడు కిలోమీటర్ల లింక్ తారు రోడ్డు అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ శనివారం ఆయా గ్రామాల నాయకులు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి వినయ్ కుమార్ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. ఆయనను నాయకులు శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు భూమా రెడ్డి, జై గంగారెడ్డి, దిలీప్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, సునీల్ రెడ్డి, గంగయ్య, శేఖర్, భాస్కర్ రెడ్డి, ఎర్రన్న, గుండు సాయి పాల్గొన్నారు.



# కొండా లక్ష్మణ్ బాపూజీ కి కంది శ్రీనివాస రెడ్డి ఘన నివాళ్లు

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

సామాజిక తెలంగాణ స్వాప్నికుడు మూడు తరాల తెలంగాణ సమరయోధుడు మాజీ మంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జి కంది శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి.కాంగ్రెస్ శ్రేణులు,పద్మశాలి సంఘం నాయకులతో కలిసి ఆదిలాబాద్ పట్టణంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలు వేసి ఘన నివాళులర్పించారు.ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం తన మంత్రి పదవిని త్యచించిన గొప్ప త్యాగశీలి కొండా లక్ష్మణ్ బాపూజీ అన్నారు.తెలంగాణ రాష్ట్రానికే వన్నెతెచ్చిన మహా నాయకుడని అంత గొప్ప మహానేత మన జిల్లాలో జన్మించడం మన అదృష్టం అన్నారు.ఆయన ఆశయాలు ఆకాంక్షల్ని సాధించేవరకు అంతా కలిసి అలుపెరగకుండా శ్రమించాలన్నారు.పద్మశాలి కులస్తులు అన్ని రంగాలలో రాణించాలని కంది శ్రీనివాస రెడ్డి ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత రాష్ట్ర ఉపాధ్యక్షుడు బేత రమేష్,టౌన్ మహిళా అధ్యక్షురాలు తన్నీరు నవత,తాలూకా మాజీ అధ్యక్షుడు బొమ్మ కంటి రమేష్,మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు బూర్ల శంకరయ్య,కామన్ విట్టల్,చిలుక విలాస్,సిహెచ్ గంగన్న,కాంగ్రెస్ నాయకులు గిమ్మ సంతోష్ రావు,లోక ప్రవీణ్ రెడ్డి,ఆనంద్ రావు,పద్మశాలి కులస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# ఏటీసీ నైపుణ్య కోర్సులను యువత సద్వినియోగం చేసుకోవాలి: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

విద్యా వ్యవస్థలో నూతన ఒరవడికి ప్రజా ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. రూ. 2,324 కోట్లు పైగా ఖర్చు చేసి ప్రజా ప్రభుత్వం 65 ఐటీఐ సెంటర్ లను ఆధునాతన సాంకేతిక కేంద్రాలుగా(ఏటీసీ) అప్ గ్రేడ్ చేస్తుండగా, వాటిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్చువల్ విధానంలో శనివారం ప్రారంభించగా, తంగళ్లపల్లి మండలం మండేపల్లిలోని ఐటిఐ కేంద్రం ప్రాంగణంలో ఆరు కోర్సులతో ఏర్పాటు చేసిన ఆధునాతన సాంకేతికకేంద్రం(ఏటీసీ) ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఏటీసీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పరికరాలు, యంత్రాలు, వాటి పనితీరును పరిశీలించారు.ప్రభుత్వ విప్ మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో విద్య, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తుందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు చేస్తూ అన్ని వర్గాలకు ప్రజా ప్రభుత్వం అండగా నిలబడుతుందని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి విద్యాశాఖ బాధ్యతలు చూస్తూ నూతన ఒరవడికి శ్రీకారం చుడుతున్నారని వివరించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా యువత, విద్యార్థులకు ఉపాధి కల్పించడం లక్ష్యంగా కంపెనీ అవసరాలు తీర్చడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నదని తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 65 ఏటీసీ కేంద్రాలు ఈరోజు ప్రారంభించారని వివరించారు. రుద్రంగిలో రూ. 43 కోట్లతో ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఏటీసీ ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. ఏటీసీల్లో నైపుణ్య శిక్షణ పొందిన యువతకు కనీసం 20 వేల రూపాయల ప్రారంభ వేత్తనంతో ఉపాధి లభించేలా అనేక కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు విద్యార్థులకు అందించేందుకు టాటా సంస్థ సహకారంతో వివిధ కోర్సులు ఏటీసీలో విద్యార్థులకు నేర్పిస్తున్నామని



వివరించారు. జిల్లాలోని ఏటీసీలో 172 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఇంజనీరింగ్, ఎంబిఏ వంటి కోర్సులనే కాకుండా మంచి ఉపాధి అవకాశాలు సత్వరం లభించే ఏటీసీ కోర్సుల వైపు కూడా ప్రోత్సాహించాలని సూచించారు. తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చే దిశగా యువత బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డి, ఏఎంసి చైర్మన్లు స్వరూపారెడ్డి, రొండి రాజు, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా ఉపాధి కల్పన అధికారి రాఘవేందర్, ప్రిన్సిపాల్ కవిత పాల్గొన్నారు.

# అమరచింతల ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు.

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.**

అమరచింత పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో స్వతంత్ర సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి మున్సిపల్ కమిషనర్ సిహెచ్ నాగరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి కమిషనర్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర సమరయోధుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ పోరాటం,సాహసం, ధైర్యం, పట్టుదల త్యాగం అంకితభావం, ఉద్యమ స్ఫూర్తి పాలనదక్షిత ప్రజాహిత సేవ విలక్షణమైన నాయకత్వ లక్షణాలు గల సమ్మేళనమే కొండా లక్ష్మణ్ బాపూజ అని అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ పెత్తందారి దోపిడీ సామాజిక వ్యవస్థ పై తిరుగుబాటు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.




# మధ్యవర్తిత్వం ద్వారా సమాజంలో సఖ్యతా వాతావరణాన్ని నెలకొల్పాలి: జిల్లా జడ్జి పి.నీరజ

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

మధ్యవర్తిత్వం ద్వారా సమాజంలో సఖ్యతా వాతావరణాన్ని నెలకొల్పడంలో కీలక పాత్ర పోషించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికర సంస్థ అధ్యక్షురాలు పి.నీరజ, కార్యదర్శి రాధిక జైస్వాల్ సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోర్టు ఆవరణలో శనివారంన్యాయవాదులకు మధ్యవర్తిత్వం ద్వారా వివాదాల పరిష్కారం చేసే పద్ధతులపై 40 గంటల శిక్షణ అవగాహన కల్పించగా, వారూ న్యాయమూర్తులను మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడారు. కుటుంబ, ఆస్తి మరియు ఇతర వ్యక్తిగత వివాదాలను సఖ్యతా పూర్వకంగా పరిష్కారం చేయుటకు మధ్యవర్తిత్వం ఎంత ముఖ్యమో ఈ శిక్షణ కార్యక్రమంలో వివరించడం జరిగిందని, శిక్షణ పూర్తి అయిన వారిని అభినందిస్తూ, మధ్యవర్తిత్వం ద్వారా సమాజంలో సఖ్యతా వాతావరణాన్ని నెలకొల్పడంలో వారు కీలక పాత్ర పోషించాలని సూచించారు.



# కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా పూలతో నివాళులర్పించిన అదనపు -ఎస్పీ బి సురేందర్ రావు

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

తెలంగాణ మలిదశ తొలిదశ ఉద్యమాలలో కీలకంగా వ్యవహరించిన ఉమ్మడి ఆదిలాబాద్ కు చెందిన దివంగత నేత మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఆదిలాబాద్ పోలీసు ముఖ్య కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన జయంతి కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి సురేందర్ రావు పాల్గొని మహనీయుని చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం కోసం పోరాడిన,బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి తెలంగాణ తొలి ఉద్యమకారుడు,దేశ స్వాతంత్ర ఉద్యమంలోనూ పాల్గొని అవే విలువలను జీవితాంతం పాటిస్తూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అన్ని దశల ఉద్యమాలలోను కొండా లక్ష్మణ్ బాపూ జీ స్ఫూర్తిగా నిలిచారని అనగారిన వర్గాల హక్కుల సాధన కోసం,సహకార రంగాల పటిష్టత కోసం జీవితమంతా కృషి చేసిన మహనీయుడని కొనియాడారు.ఈ కార్యక్రమంలో డిఎస్పీలు సిహెచ్ నాగేందర్,కమతం ఇంద్రవర్ధన్,రిజర్వ్ ఇన్స్పెక్టర్ టి మురళి,డి వెంకటి,ఎన్ చంద్రశేఖర్,పోలీసు ముఖ్య కార్యాలయం ఏవో భక్త ప్రహ్లాద్,సూపరింటెండెంట్లు సులోచన,సంజీవ్ కుమార్,సీసీ కొండరాజు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# వెలమ సంఘ ఆధ్వర్యంలో జరిగిన బతుకమ్మ సంబరాల్లో కాంగ్రెస్ నేతలు

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

వెలమసంఘమిత్రులు,సన్నిహితులు,కుటుంబసభ్యులతో కలిసి బతుకమ్మ వేడుకలలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు.శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని పద్మనాయక గార్డెన్ లో వెలమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన బతుకమ్మ సంబరాలలో కంది శ్రీనివాస రెడ్డి తో పాటు టీపీసీసీ మాజీ కార్యదర్శి గండ్రత్ సుజాత,కంది సాయిమౌనా రెడ్డి,గిమ్మసంతోష్,వెల్మ సంఘ నాయకలు తదితరులు పాల్గొన్నారు.అందరితో కలిసి బతుకమ్మ పాటలకు లయ బద్దంగా స్టెప్పులేస్తూ నేతలు అందరినీ అలరించారు.



# నూతన డిజిపి శివధర్ రెడ్డి కి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే పాయల్ శంకర్

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

నూతనంగా నియామకమైన డీజీపీ శివధర్ రెడ్డి ఐ.పి.ఎస్ గారిని హైదరాబాద్ లోని వారి కార్యాలయంలో శనివారం రోజు ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.



# పాఠశాలలో బతుకమ్మ వేడుకలు

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**



బాల్కొండ మండల కేంద్రంలోని శాంభవి పాఠశాల చైర్మన్ మధుసూదన్ రాజు బొట్ల, కరెస్పాండంట్ రవీన్ ప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులు బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఇంద్రాణి బొట్ల, వైస్ ప్రిన్సిపాల్ మంజుల బొట్ల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఉత్తమ బతుకమ్మలకు నగదు ప్రోత్సాహకాలు అందజేసిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

**సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్ బ్యూరో**

భిక్నూర్ మండల కేంద్రంలోని గార్డెన్స్ లో శనివారము నిర్వహించిన బతుకమ్మ సంబరాలకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మొహమ్మద్ షబ్బీర్ అలీ ముఖ్య అతిథిగా విచ్చేసి, మాట్లాడారు. తెలంగాణ సాంప్రదాయ బతుకమ్మ పండుగను ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో నిర్వహిస్తున్నదని పేర్కొన్నారు. అనంతరం ఉత్తమ బతుకమ్మలకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# దుర్గామాత సన్నిధానంలో ప్రత్యేక పూజలు

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

బాల్కొండ మండల కేంద్రంలోని ఆర్మూర్ గల్లీ పెద్దమ్మ దేవాలయంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసిన దుర్గామాత సన్నిధానంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి, దూప దీప నైవేద్యాలు సమర్పించి హారతి నీరాజనం పలికారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాద్ వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల యూత్ ఉపాధ్యక్షుడు విక్కీ, ముదిరాజ్ యువకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ ఆత్మాభిమానానికి ప్రతీక.. బతుకమ్మ పండుగ: కాంగ్రెస్ ఇన్చార్జి వినయ్ కుమార్ రెడ్డి

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి ఆర్మూర్ టౌన్

ఆర్మూర్ పట్టణంలోని జాంబి హనుమాన్ టెంపుల్ లో శనివారం బతుకమ్మ పండుగ వేడుకల సందర్భంగా కాంగ్రెస్ ఇన్చార్జి వినయ్ కుమార్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఉత్తమ బతుకమ్మలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, ఆర్మూర్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు, ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ పవన్ పండిట్, జాంబి హనుమాన్ కమిటీ చైర్మన్ రేగుల సత్యనారాయణ, పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు దొండి రమణ, మాజీ కౌన్సిలర్ రింగుల భూషణం, సిద్ధుల గుట్ట డైరెక్టర్ జిమ్మీరవి, ఆ సీనియర్ నాయకులు నూతుల నారాయణరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గోపి కిషన్ గౌడ్, ఐలాపురం సుదర్శన్, విజయ అగర్వాల్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు




# దుర్గామాత సన్నిధానాలను సందర్శించిన చక్రధర్ రెడ్డి

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో శనివారము కాంగ్రెస్ పార్లమెంటరీ కో కన్వీనర్ కనమేని చక్రధర్ రెడ్డి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న దుర్గామాత సన్నిధానాలను సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనను సన్మానించారు.



# దుర్గామాత ఉత్సవాలను సందర్శించిన కేకే మహేందర్ రెడ్డి

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

సిరిసిల్ల నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డి, శనివారం ముస్తాబాద్ పట్టణ కేంద్రంలోని పోచమ్మ యూత్ దుర్గామాతను సందర్శించారు. ఈ సందర్భంగా యూత్ ప్రతినిధులు మహేందర్ రెడ్డికి ఘనంగా సన్మానం జరిపారు.



# బకాయి జీతాల కోసం పంచాయతీ కార్మికుల రిలే దీక్ష

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

బకాయి జీతాలు చెల్లించాలని ఉద్యోగాలు రెగ్యులరైజేషన్ చేయాలని కోరుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మేజర్ గ్రామపంచాయతీ ఎదుట శనివారము పంచాయతీ కార్మికుల మండల అధ్యక్షులు లోకిన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు రిలే దీక్షలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్లమెంటరీ కో కన్వీనర్ కనమేని చక్రధర్ రెడ్డి, ఇదే దీక్ష శిబిరాన్ని సందర్శించి సంబంధిత మంత్రితో మాట్లాడి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని, ప్రస్తుతం తక్షణమే ఒక నెల జీతం అందేలా కృషి చేస్తానని హామీ ఇవ్వగా పంచాయతీ కార్మికులు సంతోషాన్ని వెలిబుచ్చారు.



# అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లతో విరివిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

## రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ

## కలెక్టర్ తో కలిసి ఏ.టీ.సీ సెంటర్లకు ప్రారంభోత్సవాలు

సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్,

సెప్టెంబర్ 27 :

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నెలకొల్పిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో నైపుణ్యంతో కూడిన శిక్షణ పొందడం ద్వారా యువతకు విరివిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అందుబాటులోకి తెచ్చిన 65 అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను శనివారం హైదరాబాద్ లోని మల్లెపల్లి ఏ.టీ.సీ సెంటర్ నుండి మంత్రులు జి.వివేక్ వెంకటస్వామి, డి.శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తదితరులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్చువల్ విధానం ద్వారా లాంచనంగా ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో భాగంగానే నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని శివాజీనగర్ లో గల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐ.టీ.ఐ) ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన రెండు ఏ.టీ.సీ కేంద్రాలను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డితో కలిసి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ప్రారంభించారు. ఏ.టీ.సీ కేంద్రాలలో వివిధ కోర్సులలో శిక్షణ అందించేందుకు వీలుగా నెలకొల్పిన ఆధునిక యంత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ, ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా, సరికొత్త సాంకేతికత అంశాలతో యువతలో నైపుణ్యాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఏ.టీ.సీ కేంద్రాలను ఏర్పాటు చేసిందని అన్నారు. అదే సమయంలో పారిశ్రామిక అవసరాలకు నైపుణ్యం కలిగిన అభ్యర్థులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ మేరకు నిజామాబాద్ జిల్లాలోని బోధన్, కమ్మర్పల్లి, భీంగల్, నిజామాబాద్ లలో ఐదు అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. ఒక్కో ఏ.టీ.సీ సెంటర్ కు రూ. 4.70 కోట్ల నిధులను ఖర్చు చేశారని వివరించారు. మొదటి ఏడాది ఆరు కోర్సులలో శిక్షణ అందించడం జరుగుతోందని, క్రమక్రమంగా మార్కెట్ డిమాండ్ ఉన్న మరిన్ని ఆధునిక కోర్సులలో శిక్షణ అందించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని అన్నారు. టాటా కన్సల్టెన్సీ సంస్థతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుని ఏ.టీ.సీ కేంద్రాలలో శిక్షణ ఇప్పిస్తోందని, దీని వల్ల విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ప్లేస్ మెంట్ గ్యారంటీ ఉందన్నారు. అంతేకాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలలో, మల్టీ నేషనల్ కంపెనీలలో ఆకర్షణీయ వేతనాలపై కొలువులు పొందేందుకు ఆస్కారం ఉంటుందని, స్వయం ఉపాధికి కూడా ఆ కోర్సులు ఊతమందిస్తాయని షబ్బీర్ అలీ అన్నారు. ఈ అవకాశాన్ని యువతీ, యువకులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఏ.టీ.సీ కేంద్రాల ప్రిన్సిపాల్స్, ఇన్ స్ట్రక్టర్లు, శిక్షణ పొందుతున్న అభ్యర్థులు పాల్గొన్నారు.





# జెడ్.పి.టి.సి, ఎం.పి.పి స్థానాలకు రిజర్వేషన్ల ఖరారు:కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి వెల్లడి

## రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కొనసాగిన ప్రక్రియ

సమయజ్యోతి న్యూస్

నిజామాబాద్, సెప్టెంబర్ 27 :

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని జెడ్.పి.టి.సి, ఎం పి.పి స్థానాలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరిస్తూ రిజర్వేషన్ లు ఖరారు చేయడం జరిగిందని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్సు హాల్ లో అదనపు కలెక్టర్ అంకిత్, జెడ్పీ సీ.ఈ.ఓ సాయాగౌడ్, డిప్యూటీ సీ.ఈ.ఓ సాయన్నలతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రిజర్వేషన్ల కేటాయింపు ప్రక్రియ నిర్వహించారు. జిల్లాలోని 31 జెడ్.పి.టి.సి, ఎం పి.పి స్థానాల కోసం ఎస్.సి, ఎస్.టి, బి.సి, జనరల్ రిజర్వేషన్లను వీడియో రికార్డింగ్ మధ్యన, నిబంధనలను అనుసరిస్తూ పూర్తి పారదర్శకంగా రిజర్వేషన్లు ఖరారు చేశారు. 2011 జనాభా ప్రాతిపదికన ఎస్.సి, ఎస్.టి రిజర్వేషన్లు, బీ.సీ డెడికేషన్ కమిషన్ నివేదికను అనుసరిస్తూ, రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనలకు అనుగుణంగా బి.సి రిజర్వేషన్ కేటాయింపులు చేశామని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలోని మొత్తం 31 జెడ్.పి.టి.సి స్థానాలకు గాను ఎస్.టిలకు 3 స్థానాలు రిజర్వ్ అయ్యాయని, అందులో ఒకటి మహిళకు రిజర్వ్ అయ్యిందని కలెక్టర్ తెలిపారు. ఎస్.సి లకు 5 జెడ్.పీ.టీ.సి స్థానాలు రిజర్వ్ కాగా, మహిళలకు 2 స్థానాలు కేటాయించ బడ్డాయని అన్నారు. బీ.సి లకు 13 స్థానాలు రిజర్వ్ కాగా, వీటిలో 6 స్థానాలు మహిళలకు కేటాయించ బడినాయని తెలిపారు. మిగతా 10 మండలాలు జనరల్ కేటగిరిలో ఉండగా, వీటిలో 5 స్థానాలు మహిళలకు కేటాయించడం జరిగిందని వివరించారు. అదేవిధంగా జిల్లాలోని 31 ఎం.పీ.పీ స్థానాలకు గాను ఎస్.టిలకు 3 స్థానాలు రిజర్వ్ అయ్యాయని, అందులో ఒకటి మహిళకు రిజర్వ్ అయ్యిందని కలెక్టర్ తెలిపారు. ఎస్.సి లకు 5 ఎం.పీ.పీ స్థానాలు రిజర్వ్ కాగా, మహిళలకు 2 స్థానాలు కేటాయించబడ్డాయని అన్నారు. బీ.సి లకు 13 స్థానాలు రిజర్వ్ కాగా, వీటిలో 6 స్థానాలు మహిళలకు కేటాయించబడి నాయని తెలిపారు. మిగతా 10 మండలాలు జనరల్ కేటగిరిలో ఉండగా, వీటిలో 5 స్థానాలు మహిళలకు కేటాయించడం జరిగిందని కలెక్టర్ వెల్లడించారు. ఖరారైన రిజర్వేషన్ల వివరాలను ప్రభుత్వానికి, ఎన్నికల కమిషన్ కు నివేదించడం జరుగుతుందని తెలిపారు.




# ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్, సెప్టెంబర్ 27 :

తెలంగాణవాది, స్వాతంత్ర్య పోరాట యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకను శనివారం ఘనంగా నిర్వహించారు. వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా ఈ ఉత్సవాలు జరిపారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ అంకిత్, బీ.సి, పద్మశాలి కుల సంఘాల ప్రతినిధులు, తదితరులు వినాయకనగర్ లోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం న్యూ అంబేద్కర్ భవన్ లో నిర్వహించిన జయంతి కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తుది శ్వాస వరకు అంకితభావం, నిజాయితీగా కృషి చేసిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని ప్రశంసించారు. కేవలం తెలంగాణ ఉద్యమంలోనే కాకుండా దేశ స్వాతంత్ర్య పోరాటంలోనూ పాల్గొన్నారని, చట్టసభల్లో గళమెత్తి తన పదవులను తృణప్రాయంగా వదులుకున్న త్యాగశీలి అని గుర్తు చేశారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాల సాధనకు అందరూ పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి నర్సయ్య, పద్మశాలి, బీసీ కుల సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పనిని వాయిదా వేయరాదు ! (ఆధ్యాత్మికం )

తిరుమల,సెప్టెంబర్27(సమయజ్యోతి):

పనిని వాయిదా వేయడం సరికాదు. ఆజ్ కా కామ్ ఆజ్ కరో..కల్ కాక కామ్ ఆజ్ కరో అని పెద్దలు చెప్పారు. ఎప్పటి పని అప్పుడే చేయాలి. పని చేయడానికి కార్యాచరణ కూడ ఆముఖ్యమే. రేపటి పనిని నేడు, నేటి పనిని ఇప్పుడే చేయాలని కార్యదీక్ష కలవాళ్లు అనుకుంటారు. అలా చెయ్యడానికి పూనుకొంటారు. అప్పుడే పనులవేగం పెరుగుతుంది. తక్కువ సమయంలో ఎక్కువ పనులు చేయడానికి వీలవుతుంది. మన జీవితకాలంలో ఏమి సాధించామన్నదే జీవన సాఫల్య గణనలోకి వస్తుంది. అంతేతప్ప, ఎన్నాళ్లు జీవించామనేది లెక్కలోకి రాదు.సమయం విలువ తెలిసినవారు క్షణమైనా వ్యర్థం చెయ్యరు. ప్రతి క్షణాన్నీ ఎలా సద్వినియోగం చెయ్యాలో ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకుంటారు. తాము ఎంచుకున్న రంగంలో మానసికంగా, భౌతికంగా నిమగ్నులై ఉంటారు. ఒక రచయిత, కవి, చిత్రకారుడు భౌతికంగా చేసే కృషి కన్నా ఎన్నో రెట్లు మానసికంగా చేసే భావనాత్మక కృషి ఉంటుంది. నిద్రలో మనసులో మథనం జరుగుతూనే ఉంటుంది. వాటిని చెదిరిపోకుండా పదిలపరచు కోగలిగితే అద్భుత సృజనలుగా ఆవిష్కృతమవుతాయి. బ్రహ్మ సృష్టికర్త అయితే కళాకారుడు, కవి సృజనకారులు. అయితే, దేనికైనా ప్రాతిపదిక పవిత్రంగా ఉండాలి. భావ ప్రసారంలో స్పష్టత ఉండాలి. అప్పుడే అది ఆశించిన ప్రయోజనాన్ని పొందుతుంది.

# ప్రజలను ఏమార్చిన కాంగ్రెస్ పార్టీ

## -రేవంత్రెడ్డి కటింగ్ మాస్టర్ మాత్రమే-అప్పుడురజనీకాంత్..ఇప్పుడు గజనీకాంత్

## -బాకీకార్డులను విడుదల చేసిన కెటిఆర్, హరీష్ రావు

**హైదరాబాద్,సెప్టెంబర్27(సమయజ్యోతి):**

మార్పు మార్పు అని ప్రజలని ఏమార్చడం తప్ప కాంగ్రెస్ చేసిందేమీ లేదని మాజీ మంత్రి హరీష్ రావు మండిపడ్డారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ గ్యారెంటీ- కార్డులను ప్రతి ఇంటికి పంచారని, నేడు బాకీ కార్డులను తాము అదే ఇండ్లకు పంచుతామని పేర్కొన్నారు. ఎన్నికల ముందు రజనీకాంత్ లాగా మాట్లాడి, ఎన్నికల తర్వాత గజినీకాంత్ లాగా రేవంత్ రెడ్డి మారిపోయారని ఎద్దేవా చేశారు. కెటిఆర్ తదితరులతో కలసి తెలంగాణ భవన్‌లో బాకీ కార్డులు విడుదల సందర్భంగా హరీష్ రావు మీడియాతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలు, జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఓట్ల కోసం మీ ఇండ్ల ముందుకు వచ్చే కాంగ్రెస్ నాయకులకు ఈ కార్డు చూపించి ప్రజలు నిలదీయాలని సూచించారు. జయసూర్య రేవంత్ రెడ్డి చీఫ్ మినిస్టర్ కాదు అని, కటింగ్ మాస్టర్ అయ్యారని హరీష్ రావు చురకలంటించారు. బిఆర్ఎస్ ప్రారంభించిన వాటికి సిఎం రేవంత్ రెడ్డి రిబ్బన్ కటింగ్ చేస్తున్నారని దుయ్యబట్టారు. కెసిఆర్ అమలు చేసిన పథకాలకు కటింగ్ చేస్తున్నారని, అయితే రిబ్బన్ కటింగ్ లేదంటే సంక్షేమ పథకాలకు కటింగ్ అవుతుందని ఎద్దేవా చేశారు. ఎంతసేపూ అక్రమ కేసులతో ప్రభుత్వాన్ని నడపలేవని రేవంత్ కు చురకలంటించారు. బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంకలో ప్రజలు తిరగబడ్డరని, రేవంత్ ప్రభుత్వానికి కాలం దగ్గర పడుతుందని హెచ్చరించారు. ప్రజలు తిరగబడే రోజులు వస్తున్నాయని, బాకీ కార్డుతో అప్పుడు ప్రజలు మిమ్మల్ని గల్లా పట్టుకొని అడుగుతారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రశ్నిస్తామన్నారు. తాము ప్రశ్నిస్తే తమపై కేసులు పెడుతున్నారని తెలిపారు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క బాండు పేపర్‌పై సంతకాలు పెట్టి ఎన్నికల హామీలు ఇచ్చారని.. కానీ ఎన్నికల హామీలపై ఇప్పుడెందుకు మౌనంగా




ఉంటున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ బకాయి కార్డులను ఇంటింటికీ పంచుతామని చెప్పుకొచ్చారు. బాకీ కార్డు చూపించి ప్రజలు కాంగ్రెస్ నేతలను నిలదీయాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మి ప్రభుత్వ ఉద్యోగులు, ఆటో కార్మికులు, వ్యవసాయ కార్మికులు సైతం మోసపోయారని విమర్శించారు. ఆరు గ్యారెంటీ-లపై తెలంగాణ అసెంబ్లీలో చర్చిదామంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పారిపోయారని దెప్పిపొడిచారు. మార్పు మార్పు అంటూ ప్రజలను రేవంత్‌రెడ్డి ఏమార్చారని విమర్శించారు. ఎన్నికల ముందు గల్లీ గల్లీ తిరిగిన గాంధీలు.. ఇప్పుడు ఎక్కడ..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రజలు ప్రశ్నిస్తారని గాంధీలు హైదరాబాద్‌కు రాకుండా ముఖం చాటేశారని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు.

# బిసి రిజర్వేషన్లపై జివో వచ్చింది

## మరోమారు మైకోర్టును ఆశ్రయించిన మాధవరెడ్డి

**హైదరాబాద్,సెప్టెంబర్27(సమయజ్యోతి):**

బీసీ రిజర్వేషన్లపై మరోసారి హైకోర్టును మాధవరెడ్డి ఆశ్రయించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల జీవోను సవాల్ చేస్తూ పిటిషన్ వేశారు. దీనిపై హౌజ్ మోషన్ పిటిషన్‌కు అనుమతి కోరారు. హైకోర్టు రిజిస్ట్రీ పరిశీలనలో ఇది ఉంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తూ నిన్న ప్రభుత్వం జీవో జారీ చేసింది. మూడు రోజుల క్రితమే ఈ రిజర్వేషన్లపై మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మూడుచింతలపల్లి మండలం కేశవాపూర్ గ్రామానికి చెందిన బు-÷-టటె-ంగారి మాధవరెడ్డి పిటిషన్ వేశారు. అయితే.. మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా పిటిషన్‌ను విచారించలేమని కోర్టు స్పష్టం చేసింది. నిన్న జీవో విడుదల కావడంతో మరోసారి కోర్టును పిటిషనర్ ఆశ్రయించారు.

# ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ముందుకు వెళతా

## -డ్రగ్స్,సైబర్ క్రైమ్ నిర్మూలనకు మరింత కృషి

## -నగర ట్రాఫిక్ కంట్రోల్‌కు సమన్వయంతో కృషి

## - నూతన డీజీపీగా నియమితులైన శివధర్ రెడ్డి

**హైదరాబాద్,సెప్టెంబర్27(సమయజ్యోతి):**

ప్రజల పక్షానే తాము ఉంటామని.. ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తామని తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా నియమితులైన శివధర్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ నియంత్రణ కోసం అన్ని శాఖల అధికారులతో కోఆర్డినేషన్ చేసుకుంటూ ముందుకు వెళ్తామని తెలిపారు. రాష్ట్రంలో మహిళల భద్రతకు పెద్దపీట వేస్తామని అన్నారు. సైబర్ నేరాలపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కృషి చేస్తోందని వెల్లడించారు. ప్రజలకు, పోలీసులకు మధ్య సంబంధాలను పెంపొందించడానికి ప్రయత్నిస్తామని తెలిపారు. ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తామని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా శివధర్ రెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా డీజీపీగా అవకాశం ఇచ్చినందుకు తెలంగాణ ప్రభుత్వానికి శివధర్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. తనకు ఇచ్చిన ఈ అవకాశాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తానని ఉద్ఘాటించారు. ఇంటెలిజెన్స్‌లో ఎస్పీ స్థాయి నుంచి డీజీ స్థాయి దాకా పనిచేశానని.. తెలంగాణ రాష్ట్రంపై తనకు పూర్తి అవగాహన ఉందని వ్యాఖ్యానించారు. పోలీస్ విభాగంలో అందరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని డీజీపీ శివధర్ రెడ్డి సూచించారు. డ్రగ్స్‌పై తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే చాలా చర్యలు తీసుకుందని.. ఈగల్ టీమ్ కూడా చాలా స్ట్రాంగ్‌గా పనిచేస్తోందని నొక్కిచెప్పారు. డ్రగ్స్ ఒక మహమ్మారి లాగా మారిందని.. ఒక పోలీసుతోనే దీన్ని నిర్మూలన కాదని.. ప్రజల నుంచి కూడా పెద్దఎత్తున సహకారం కావాలని తెలిపారు. సైబర్ క్రైమ్ సెక్యూరిటీలో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని పేర్కొన్నారు. సైబర్ క్రైమ్ మోసాలు, సైబర్ సెక్యూరిటీ- సమస్య దేశం మొత్తం పెద్ద సమస్యగా మారిందని చెప్పుకొచ్చారు. మన దగ్గర ఉన్నటువంటి సైబర్ సెక్యూరిటీ- బ్యూరోతో నేరాలను చాలావరకు అరికడుతున్నామని డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిజాన్ని తగ్గించే ప్రయత్నాలు చేస్తున్నాయని చెప్పుకొచ్చారు.

# మిరాయ్ టిక్కెట్ ధరల తగ్గింపు

**హైదరాబాద్,సెప్టెంబర్27(సమయజ్యోతి):**

తేజ సజ్జా, మంచు మనోజ్ కీలక పాత్రల్లో యువ దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని రూపొందించిన ఫాంటసీ ఫిల్మ్ 'మిరాయ్' విజయవంతంగా ప్రదర్శితం అవుతోంది. సెప్టెంబరు 12న పాన్ ఇండియా స్థాయిలో విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు రాబడుతోంది. ఇప్పటివరకూ రూ.140 కోట్లకు పైగా వసూలు చేసింది. ఈ క్రమంలో మరింత మంది ప్రేక్షకులకు సినిమాను చేరువ చేసేందుకు చిత్ర బృందం కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీ, తెలంగాణలోని సింగిల్ స్క్రీన్ టికెట్ ధరలను తగ్గించింది. 'ఈ దసరాను మీ కుటు-ంబం, పిల్లలతో కలిసి 'మిరాయ్' సినిమా థియేటర్‌లో జరుపుకోండి. సింగిల్ స్క్రీన్లో అతి తక్కువ టికెట్ ధరకు మూవీని ఆస్వాదించండి' అని పేర్కొంది. బాల్కనీ టికెట్ ధరను రూ.150, ఫస్ట్ క్లాస్‌ను రూ.105గా నిర్ణయించింది. చిత్ర నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ తాజా నిర్ణయంతో మరింత మంది ప్రేక్షకులు థియేటర్‌కు క్యూ కట్టే అవకాశం ఉందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ సినిమా విడుదల సమయంలోనూ సాధారణ టికెట్ ధరలనే అమలు చేస్తేనే రూ.140 కోట్లు- వసూలు కాగా, ఇప్పుడు తగ్గించిన ధరలతో మరింత మంది ప్రేక్షకులు థియేటర్‌కు వచ్చే అవకాశం ఉంది. మరోవైపు థియేటర్‌కు వచ్చే ప్రేక్షకులకు మరింత వినోదాన్ని అందించడానికి 'వైబ్' సాంగ్‌ను జత చేస్తున్నట్లు- చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది. 'చాట్‌బాస్టర్ 'వైబ్' సాంగ్‌ను ప్రపంచవ్యాప్తంగా 'మిరాయ్' ప్రదర్శితమవుతున్న అన్ని షోలలోనూ యాడ్ చేస్తున్నాం' అని చిత్ర నిర్మాణసంస్థ తెలిపింది. గౌర హరి స్వరాలు సమకూర్చిన ఈ పాటకు కృష్ణకాంత్ సాహిత్యం అందించారు. అర్మాన్ మాలిక్ ఆలపించారు.

# కొడంగల్ నుంచే బిఆర్ఎస్ జైత్రయాత్ర

## వచ్చే ఎన్నికల్లోరేవంత్ కొడంగల్ పోటీ అనుమానమే

## బిఆర్ఎస్‌లో చేరిన పలువురితో కెటిఆర్

**హైదరాబాద్,సెప్టెంబర్ 27(సమయజ్యోతి):**

వచ్చే ఎన్నికల్లో రేవంత్ రెడ్డి కొడంగల్ నుంచి పోటీ- చేయరంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. కొడంగల్ నుంచే బీఆర్ఎస్ జైత్రయాత్ర మొదలవుతుందని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. శనివారంకేటీఆర్ సమక్షంలో కొడంగల్‌కు చెందిన కాంగ్రెస్, బీజేపీ నేతలు.. బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ.. సొంత నియోజకవర్గ ప్రజలు రేవంత్ రెడ్డిపై రగిలిపోతున్నారన్నారు. కాంగ్రెస్‌ను బొంద పెట్టడానికి స్థానిక సంస్థల ఎన్నికలు మంచి అవకాశమని వెల్లడించారు. కొడంగల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో బీఆర్ఎస్ గెలవాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత రైతు బంధు పథకాన్ని రేవంత్ బంద్ చేస్తారంటూ కామెంట్స్ చేశారు. రేవంత్ రెడ్డి గురించి అందరి కంటే ఎక్కువ కొడంగల్ ప్రజలకే తెలుసన్నారు. రాజకీయంగా జన్మనిచ్చిన కొడంగల్ భూములను.. తొండలు గుడ్లు పెట్టని భూములంటూ రేవంత్ అవమానించారని మండిపడ్డారు. 'కొడంగల్ రేవంత్ రెడ్డి జాగీరా.. కొడంగల్‌కు రేవంత్ చక్రవర్తి కాదు. కొడంగల్ ప్రజల ఆగ్రహంలో వచ్చే ఎన్నికల్లో రేవంత్, కాంగ్రెస్ పార్టీ కొట్టు-కుపోతుంది. తెలంగాణకు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయితే.. కొడంగల్‌కు తిరుపతి రెడ్డి ముఖ్యమంత్రి. వార్డు మెంబర్ కూడా కాని తిరుపతి రెడ్డికి.. కలెక్టర్, ఎస్పీ వంగి వంగి దండాలు పెడుతున్నారు. అన్నదమ్ములు జేబులో కత్తెర పెట్టు-కుని తిరుగుతున్నారు. కేసీఆర్ కట్టిన ప్రాజెక్టులకు రేవంత్, తిరుపతి రెడ్డి రిబ్బన్ కట్ చేస్తున్నారు' అంటూ కేటీఆర్ ఎద్దేవా చేశారు. కమీషన్ల కోసమే రేవంత్ మూసీ ప్రాజెక్టు చేస్తానంటు-న్నారని మాజీ మంత్రి కేటీ-ఆర్ ఆరోపించారు. రూ.16వేల కోట్లతో అయిపోయే దానికి లక్షా 50 వేల కోట్లు ఎందుకని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి.. ఎ÷-లాన్ ప్రకారమే ఎంజీబీఎస్ బస్టాండ్‌ను ముంచారని ఫైర్ అయ్యారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజలను భయపెట్టేందుకే ఒకేసారి 15 గేట్లు- తెరిచారని అన్నారు. గతంలో ఎన్నడూ లేనిది ఇప్పుడే ఎందుకు ఎంజీబీఎస్ బస్టాండ్ మునిగిందని ప్రశ్నించారు. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పేరుతో పొంగులేటి, మెగా కృష్ణారెడ్డికి దోచి పెడుతున్నారని ఆరోపించారు.




# ఉమమడి మెదక్‌లో భారీ వర్షాలు

## నీట మునగిని ఏడుపాయల ఆలయం

## మంజీరా నది ఉధృతితో వరదలు

**మెదక్,సెప్టెంబర్27(సమయజ్యోతి):**

ఉమ్మడి మెదక్ జిల్లాలో భారీ వర్షాలు కురిసాయి. సంగారెడ్డి నియోజకవర్గంలో ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. ఈ వానలకు రోడ్లన్నీ జలయమయ్యాయి. కొండాపూర్ మండలం సైదాపూర్ నుంచి అనంతసాగర్ వెళ్లే రహదారి వరద కారణంగా కొట్టుకుపోయింది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలియిపోయాయి. ఏడుపాయల వనదుర్గ అమ్మవారి దగ్గర మంజీరా నది ఉగ్రరూపం దాల్చింది. గర్భగుడిని ముంచెత్తి అమ్మవారి పాదాలను తాకుతూ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆనకట్ట నుంచి 85,396 క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. ఏడుపాయల రెండో, మూడో బ్రిడ్జి వద్ద ప్రమాదకర స్థాయిలో నీటి ప్రవాహం ఉంది. కొల్చారం మండలం పోతంశెట్టి పల్లి నుంచి ఏడుపాయలకు వెళ్లే మొదటి బ్రిడ్జి వద్ద పోలీసులు బారికేడ్లు ఏర్పాటు- చేశారు. ఏడుపాయల అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు పాపన్నపేట మండలం నాగ్సాన్ పల్లి నుంచి వెళ్లాలని సూచిస్తున్నారు. ఇకపోతే జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో జన జీవనం అస్తవ్యస్తంగా మారింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా పలు వాగులు ఉప్పొంగడంతో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. లోలైవల్ వంతెనల పైనుంచి వాగుల నీరు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయి. మహాదేవపూర్ మండలం చంద్రపల్లి వాగు ఉధృతి పెరగడంతో అన్నారం, నాగపల్లి, మద్దులపల్లి, పలుగుల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కాటారం మండలం దామెరకుంట గుండ్రత్ పల్లి మధ్యలో అలుగు వాగు ఉప్పొంగి రాకపోకలు నిలిచాయి. మహాదేవపూర్, కాటారం, పలిమేల, మలహార్, మహా ముత్తారం మండలలో భారీ వర్షం కురుస్తుంది.

# మాతృత్వంపై అవగాహన

## మహిళా కమిషన్‌ఆధ్వర్యంలో కార్యక్రమం

**హైదరాబాద్,సెప్టెంబర్27(సమయజ్యోతి):**

నవరాత్రి,బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా మహిళా కమిషన్ ఛైర్పర్సన్ నేరెళ్ళ శారద అధ్యక్షతన బుద్ధభవన్‌లో 'మాతృత్వం మరియు ఆరోగ్యం' పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు- చేశారు. ఈ సందర్భంగా మహిళా కమిషన్ కార్యదర్శి మాట్లాడుతూ మాతృత్వం, మహిళల ఆరోగ్యం, అలాగే మహిళా కమిషన్ అందిస్తున్న సేవల గురించి వివరించారు. మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ ,నేరెళ్ళ శారద మేడమ్ గారు బతుకమ్మ, నవరాత్రి ఉత్సవాల ప్రాముఖ్యతను, మహిళల ఆరోగ్యం పట్ల తీస్కోవాల్సిన జాగ్రత్తలు మహిళలకు తెలియజేశారు. హైడ్రా కమిషనర్, రంగనాథ్ మాతృత్వంలో ఆహారపు అలవాట్లు-, సమతుల ఆహారం తీసుకోవడం ఎంత ముఖ్యమో వివరించారు బతుకమ్మ పండగ ప్రకృతికి దగర చేస్తుంది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు , అంగన్వాడీ టీ-చర్స్, బుద్ధ భవన్ లోని వివిధ శాఖల ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అవగాహన కార్యక్రమం అనంతరం బతుకమ్మ ఉత్సవాల్లో మహిళలు అందరూ చాలా ఉత్సాహంగా పాల్గొన్నరూ. ఈ కార్యక్రమంలో మహిళా కమిషన్ ఛైర్పర్సన్ నేరెళ్ళ శారద, హైడ్రా కమిషనర్ రంగనాథ్ , హైడ్రా ఎస్పీ అడ్మిన్ , కమిషన్ సెక్రటరీ గారు పద్మజ రమణ మరియు అంగన్వాడీ టీ-చర్స్,వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.




# స్థానిక ఎన్నికలపై ఇసి కసరత్తు

## వివిధ అధికారులతో కమిషనర్ భేటీ

**హైదరాబాద్,సెప్టెంబర్ 27(సమయజ్యోతి):**

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు నగారా త్వరలో మోగనుంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమమైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులతో సమావేశం నిర్వహించి ఎన్నికల సన్నాహాల కోసం ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం శనివారం వివిధ విభాగాల ఉన్నతాధికారులతో కీలక సమావేశం నిర్వహించింది.తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల సంఘం సమావేశం నిర్వహించింది.

# ఎసిబికి చిక్కిన మరో అధికారి

## టౌన్ ప్లానింగ్ అధికారి పట్టివేత

**హైదరాబాద్,సెప్టెంబర్27(సమయజ్యోతి):**

ప్రభుత్వ అధికారుల తీరు మారడం లేదు. అధికారాన్ని అడ్డం పెట్టు-కుని అడ్డగోలుగా సంపాదిస్తున్నారు. ఏసీబీ అధికారులు ఎన్ని రైడ్లు చేస్తున్నా.. ఎంత మందిని పట్టుకుంటున్నా లంచాలు తీసుకుంటూనే ఉన్నారు. తాజాగా మేడ్చల్ జిల్లా ఎల్లంపేట్ మున్సిపాలిటీలో పురపాలకలో టౌన్ ప్లానింగ్ అధికారి లంచం తీసుకుంటు-ండగా ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికాడు. హైదరాబాద్ ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం..ఎల్లంపేట్ పురపాలక సంఘం పరిధిలోని హెచ్ఎండీఏ అనుమతి ఉన్న గంగస్థాన్ వెంచర్ నిర్వహకులు తమ పరిధి మేరకు ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టి గేట్లు- ఏర్పాటు- చేశారు. అక్రమంగా ఏర్పాటు- చేసిన గేట్లను కూల్చివేస్తానని టౌన్ ఎ÷-లానింగ్ అధికారి రాధాకృష్ణా రెడ్డి బెదిరించారు. గోడ కూల్చకుండా ఉండడానికి బాధితుడిని రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు . దీంతో వెంచర్ నిర్వహకులు ఒప్పందం కుదుర్చుకుని వారం రోజుల క్రితం టీ-పీవోకి లక్ష రూపాయల లంచం ఇచ్చారు. మిగతా నాలుగు లక్షల డబ్బుల కోసం బాధితుడు ఏసీబీని సంప్రదించాడు. శనివారం ఇంటి దగ్గర డబ్బులు ఇవ్వాలని టౌన్ ప్లానింగ్ అధికారి రాధాకృష్ణ కోరడంతో కొంపల్లిలోని ఆయన ఇంటి దగ్గర బాధితుడి నుంచి రూ. 3 లక్షల 50 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఎల్లంపేట్ పురపాలక సంఘం కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న రాధాకృష్ణ రెడ్డి ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ అందుబాటు-లో లేకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కార్యాలయానికి రావాలని కోరినట్లు- తెలిపారు. కమిషనర్ ప్రమేయం ఉందా లేదా అనేది పూర్తి విచారణ చేపట్టిన అనంతరం వెల్లాడిస్తానని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఆయనను అరెస్టు చేసి రిమాండ్ కు తరలిస్తామని ఆయన తెలిపారు.

# ర్యాలీలతో ప్రాణాలు తీసేస్తున్న నేతలు

## -భారీ బలపద్రర్శనలతో సాధించేదేముంది

## -ఆందోళన కలిగిస్తున్న వరుస ఘటనలు

క్రికెట్ పరేట్ అయినా.. రాజకీయ సభ అయినా సరే.. చనిపోయేది మాత్రం సాధారణ అభిమానులే. హీరోలు, రాజకీయ నాయకులు, క్రికెటర్లు అందరూ బాగానే ఉంటారు. చనిపోయేది వాళ్ల కోసం వెళ్లిన సాధారణ ప్రేక్షకులే. ఒక ఈవెంట్ నిర్వహిస్తున్నప్పుడు ఎన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఎంత మంది వస్తారు.. అసలు అక్కడ అంత పెద్ద సభ ఏర్పాటు- చేయొచ్చా లేదా.. పోలీసుల సలహాలు ఏంటి అనేవి పాటించాలి కదా. కానీ ఎవరూ పాటించరు. తమ బల ప్రదర్శన చూపించుకోవాలి.. దాన్ని మీడియాలో, సోషల్ మీడియాలో హైలెట్ చేసుకోవాలనే తాపత్రయమే తప్ప.. అభిమానులకు ఇబ్బంది అవుతుందనే విషయం కూడా ఆలోచించట్లేదు. ఆర్సీబీ పరేడ్ కు ఎంత మంది వస్తారనే సమాచారం లేకుండానే పరేడ్ నిర్వహించారు. ఇప్పుడు విజయ్ ఎంత మంది వస్తారనే సమాచారం లేకుండానే ర్యాలీ చేశారా.. తెలిసి కూడా కావాలనే చేస్తున్నారా. ఇదంతా ఎందుకు చేస్తున్నారు.. ఎవరి కోసం చేస్తున్నారు. ప్రజల ప్రాణాల మీదకు వచ్చే ఇలాంటి ర్యాలీలు పెద్ద ఎత్తున నిర్వహించడం అవసరమా. తొక్కిసలాట ఘటనలు జరుగుతున్నప్పుడు ఆ మాత్రం జాగ్రత్త పడకపోతే ఎలా. అభిమానుల ప్రాణాలంటే మరీ అంత చులకన అయిపోయారా అన్న విమర్శలు వస్తున్నాయి, కొన్ని సార్లు పోలీసులు వద్దని హెచ్చరికలు చేసినా వినట్లేదు. చివరకు పోలీసుల వైఫల్యం అని వాళ్ల మీద నెట్టేయడం సాధారణం అయిపోయింది. ఎంత హీరో అయినా.. సెలబ్రిటీ- అయినా పెద్ద సభలు పెట్టే ముందు ఆలోచిస్తే మంచిదని సూచిస్తున్నారు.

# నరక కూపంగా సంక్షేమ హాస్టళ్లు

## పదేళ్లుగా పట్టించుకోని బిఆర్ఎస్

## ఇప్పుడే సమస్యలు అంటూ విమర్శలు

హైదరాబాద్,సెప్టెంబర్27(సమయజ్యోతి):

జ్వరాల భయంతో హాస్టళ్లు వణికిపోతున్నాయి. కల్తీ ఆహారం కూడా కలవర పెడుతోంది. ఇకపోతే హాస్టళ్లలో ఉండేలా పరిస్థితులు లేవని దారుణ పరిస్థితులను కళ్లకు అద్దం పడుతున్నాయి. పదేళ్ల పాటు హాస్టళ్లను సంస్కరించామని చెప్పుకుంటున్న బిఆర్ఎస్ నేతలు దీనిపై కళ్లు తెరవాలి. ఇప్పుడే హాస్ళ్లలో సమస్యలు లేవు. అయితే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డ తరవాత వీటిని సంస్కరించలేదు. వాటి మానాన వాటిని వదిలేశారు. ఆర్భాటపు ప్రకటనలతో ప్రజలను మభ్య పెట్టారు. సన్న బియ్యం సరఫరా పేరుతో కొన్ని రోజులు ఆర్భాటం చేశారు. అయితే సమస్యలన్నింటికి ..ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కారణమంటూ చేస్తున్న విమర్శలు వారి కుసంస్కారానికి నిదర్శనంగా చూడాలి. అన్ని రంగాలను విస్మరించినట్లుగానే వసతి గృహాలను కూడా పదేళ్లుగా పక్కన పెట్టేశారు. హాస్టళ్లలో వసతులు, పరిస్థితులు బాగులేక విద్యార్థులు ఇంటిబాట పడుతున్నారు. ఇటీవలకాలంలో హాస్టళ్లలో విద్యార్థులు మృతి చెందడం అధికారులు, ప్రజాప్రతినిధులను కలవరానికి గురిచేస్తోంది. సీజనల్ వ్యాధుల ముప్పును తప్పించుకునేందుకు పలుచోట్ల వైద్యశాఖ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటు న్నప్పటికీ పూర్తిస్థాయిలో అదుపులోకి రావడంలేదు. హాస్టళ్లలో కొన్నిచోట్ల మురుగునీరు పారుతోంది. మరికొన్ని చోట్ల డంప్‌యార్డులు, పారిశుధ్య సమస్య, ఇతర ఇబ్బందులుంటున్నాయి. ఇటీవల వర్షాలతో ఒక్కసారిగా దోమలు, ఈగలు ప్రబలడంతో జ్వరాల మోత మోగుతోంది. తలనొప్పి, కడుపునొప్పి, జ్వరం, జలుబు, దగ్గు, బాడీ పెయిన్స్, అలసట తదితరసమస్యలతోనే విద్యార్థులు బాధపడుతున్నారు. గిరిజన, సాంఘిక సంక్షేమ, మైనార్టీ, ఎంజేపీ, కస్తూర్బా, ఆదర్శ, జూనియర్, డిగ్రీ కళాశాలలతోపాటు ఇతర అన్ని గురుకులాల్లో అనేక ఇబ్బందులు ఉన్నాయనే ఆరోపణలున్నాయి. ఈ విద్యాసంస్థల్లో వేలాది మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో అనేకమంది సీజనల్‌వ్యాధులబారిన పడుతున్నా యంత్రాంగం ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోవడం లేదు. హాస్టళ్లలో సిబ్బంది విద్యార్థులకు మెనూప్రకారం భోజనం పెట్టకపోవడం శాపంగా మారుతోంది. కొన్నిచోట్ల కలుషిత ఆహారం వల్ల విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారు. కుళ్లిపోయిన కోడిగుడ్లు, నాణ్యతలేని ఆహారం అందిస్తూ అందిన కాడికి దోచుకుంటు న్నారు. సంబంధిత ఆహార సరఫరా కాంట్రాక్టర్లు, సిబ్బంది మిలాఖత్ కావడం అధికారులు పట్టించుకోక పోవడంతో ఇష్టారాజ్యంగా తయారైంది. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు కాచి చల్లార్చిన నీరు తాగాలని వైద్యులు సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల వల్ల వివిధ రకాల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం అధికంగా ఉందన్నారు. ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

# ఎంజిబిఎస్ నుంచి బస్సుల నిలిపివేత

## ఉప్పల్, జెబిఎస్, ఆరాంఘర నుంచి సర్వీసులు

## ఎక్స్ వేదికగా ఎండి సజ్జన్నార్ వెల్లడి

హైదరాబాద్,సెప్టెంబర్27 (సమయజ్యోతి):

మూసీ నదికి భారీ వరద కారణంగా ఎంజీబీఎస్ ప్రాంగణంలోకి వరద నీరు చేరింది. దీంతో ఇక్కడి నుంచి బస్సుల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. ఈక్రమంలో ఆర్టీసీ ఎండీ సజ్జనార్ 'ఎక్స్' వేదికగా ప్రయాణికులకు సూచనలిచ్చారు. ప్రయాణికులు ఎంజీబీస్‌కు రావొద్దని పేర్కొన్నారు. ఎంబీజీఎస్ నుంచి బయలు దేరే బస్సులను హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల నుంచి సంస్థ నడుపుతోంది. ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ వైపునకు వెళ్లే సర్వీసులు జేబీఎస్ నుంచి నడుస్తున్నాయి. వరంగల్, హనుమకొండ వైపునకు వెళ్లేవి ఉప్పల్ క్రాస్ రోడ్స్ నుంచి వెళ్తున్నాయి. సూర్యాపేట, నల్గొండ, విజయవాడ వైపునకు బస్సులు ఎల్బీనగర్ నుంచి నడుస్తున్నాయి. మహబూబ్‌నగర్, కర్నూలు, బెంగళూరు వైపునకు వెళ్లే సర్వీసులు ఆరాంఘర్ నుంచి వెళ్తున్నాయని అన్నారు. పొరపాటు-న ఎంజీబీఎస్‌కు ఎవరైనా ప్రయాణికులు వచ్చినా వారిని తరలించేందుకు అవసరమైనన్నీ లోకల్ బస్సులు అందుబాటులో ఉంచాం. వారిని ఆయా బోర్డింగ్ ప్రాంతాలకు లోకల్ బస్సుల్లో తరలించేందుకు సిద్ధంగా ఉన్నాం. వర్షాలు, వరద తగ్గుముఖం పట్టేవరకు ఎంజీబీఎస్‌కు ఎవరూ రావొద్దని విజ్ఞప్తి అని తెలిపారు. చాదర్‌ఘాట్, చంచల్‌గూడ, జియాగూడ, నార్సింగి, బండ్లగూడ జాగీరు వద్ద మూసీ ఉధృతి కొనసాగు తోంది. భారీ వర్షాలతో నగరంలో అధికారులు హైఅలర్ట్ ప్రకటించారు. జంట జలాశయాల నుంచి మూసీకి నీటిని వదలడంతో నది పొడవునా భయాందోళనలు నెలకొన్నాయి. వరద నీటితో ముసారాంబాగ్, చాదర్‌ఘాట్ బ్రిడ్జీలపై వరద ఉధృతంగా ప్రవహించింది. ముసారాంబాగ్ నూతన పైవంతెన నిర్మాణ సామగ్రి కొట్టుకుపోయింది. స్లాబు వేయడం కోసం ఏర్పాటు- చేసిన ఇనుమ దిమ్మెలు, వాటి కింద వేసిన పునాదులను వరద ప్రవాహం ఊడ్చేసింది. నదికి ఇరువైపులా పలు కాలనీలు నీట మునిగాయి. అధికారులు వందలాది మందిని సమీపంలోని పునరావాస కేంద్రాలకు తరలించి ఆహారం అందించారు. మూసానగర్, శంకర్‌నగర్ బస్తీల్లోని పలు కుటుంబాలు ఇళ్లను ఖాళీ చేయకపోవడంతో పోలీసులు బలవంతంగా వారిని బయటకు తీసుకెళ్లారు. ఈ రెండు వంతెనలపై వాహనాల రాకపోకలు పోలీసులు నిలిపేశారు. మూసారాంబాగ్ నుంచి అంబర్‌పేట వైపు వచ్చే అన్ని వాహనాలను భారత్ పెట్రోల్ పంప్ వద్ద నుంచి గోల్నాక కొత్త వంతెన వైపు మళ్లించారు. ట్రాఫిక్ హెల్ప్ లైన్ 90102 03626కి కాల్ చేయాలని హైదరాబాద్ సిటీ- సంయుక్త పోలీసు కమిషనర్(ట్రాఫిక్) జోయల్ డెవిస్ శుక్రవారం రాత్రి తెలిపారు. రాజధానిలో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం రాత్రి వరకు వరుణుడు తెరపినివ్వలేదు. ఎడతెగని వానతో నగరమంతా బురదమయమైంది. రహదారులపై వరద ప్రవాహం అలాగే కొనసాగింది. కూడళ్లు, లోతట్టు- ప్రాంతాల్లో నీరు నిలిచింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి 9గంటల వరకు చాంద్రాయణగుట్టలో 6.1సెం.మీ గరిష్ఠ వర్షపాతం నమోదైంది.

# తెలంగాణ పెట్టుబడులకు గమ్యస్థానం

## -ఎన్నో పర్యాకట కేంద్రాలు ఉన్నాయి-శాంతిభద్రతల విషయంలోనూ ముందున్నం

## -ప్రపంచ నగరాలతో పోటీపడుతున్న హైదరాబాద్-టూరిజం కంక్లేవ్‌లో సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్,సెప్టెంబర్27(సమయజ్యోతి):

తెలంగాణలో నూతన టూరిజం పాలసీ తీసుకొచ్చామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో రక్షణ, శాంతిభద్రతల గురించి ఆలోచించాల్సిన అవసరం లేదు. శాంతిభద్రతల విషయంలో దేశంలోనే హైదరాబాద్‌కు మొదటి స్థానంలో ఉందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రపంచ ప్రఖ్యాత నగరాలతో హైదరాబాద్ పోటీ- పడుతోంది. తెలంగాణలో పెట్టు-బడులు పెట్టండి.. మీకు అండగా ఉండటంతో పాటు-, లాభాలను అందించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని సీఎం అన్నారు.హైదరాబాద్ శిల్పారామంలో ఏర్పాటు చేసిన వరల్డ్ టూరిజం డే మొదటి కాంక్లేవ్‌లో సీఎం పాల్గొని ప్రసంగించారు. 'గోల్కొండ, రామోజీ ఫిల్మ్‌సిటీ- వంటి ప్రముఖ పర్యాటక ప్రాంతాలు హైదరాబాద్‌లో ఉన్నాయి. ఎకో, మెడికల్, హెల్త్ -టెంపుల్ టూరిజాన్ని ప్రోత్సహించాలని నిర్ణయించాం. హైదరాబాద్ ఓల్డ్ సిటీ- కాదు.. ఒరిజినల్ సిటీ-. ఆపరేషన్ సిందూర్ సమయం లోనూ.. హైదరాబాద్‌లో ప్రపంచ సుందరీమణుల పోటీలు నిర్వహించి.. ఇది అత్యంత సురక్షితమైన నగరమని నిరూపించామన్నారు. తెలంగాణలో పెట్టు-బడులకు ఎలాంటి ఢోకా లేదన్నారు. పెట్టుబడులకు హైదరాబాద్ అత్యంత అనుకూలమైన నగరం అని అన్నారు. పౌరులకు అత్యుత్తమ భద్రత కల్పిస్తున్నామని సిఎం రేవంత్ చెప్పారు. పదేండ్లు టూరిజానికి పాలసీ లేదన్న సీఎం రేవంత్.. కాంగ్రెస్ వచ్చాక సమగ్ర పాలసీ తెచ్చామన్నారు. ఏ రాష్ట్రానికి లేని టూరిజం స్పాట్లు- తెలంగాణకు ఉన్నాయన్నారు. ఎకో,హెల్త్, మెడికల్ టూరిజాన్ని ప్రోత్సహించాని నిర్ణయించామని తెలిపారు. తెలంగాణలో పెట్టు-బడులు పెడితే.. భద్రత కల్పించే బాధ్యత తమదేనన్నారు. టెంపుల్ టూరిజాన్ని మరింతగా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు . హైదరాబాద్ లో రక్షణ శాంతిభద్రతల గురించి ఆలోచించాల్సిన అవసరం లేదన్నారు. హైదరాబాద్ లో 15 వేలకోట్ల పెట్టు-బడులు అభినందనీయమని.. టూరిజం మినిస్టర్ జూపల్లిని అభినందిస్తున్నానని సీఎం రేవంత్ చెప్పారు. ప్రపంచ పర్యాటకులను ఆకర్షించే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణ అద్భుతమైన రాష్ట్రం. రెండు జీవనదుల మధ్య ఉన్న దక్కన్ పీఠభూమి. గలగలపారే జీవనదులు, ఎత్తైన కొండలు, ప్రకృతి రమణీయ సుందర దృశ్యాలతో కూడిన అటవీ ప్రాంతం. పర్యాటకులకు తెలంగాణ పరిసర ప్రాంతాలు స్వర్గసీమ లాంటివి. పర్యాటకులను పెద్ద ఎత్తున ఆకర్షిస్తున్న రాష్ట్రమిది. గత పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన భారత రాష్ట్రసమితి టూరిజంపై దృష్టి సారించకుండా, ఈ రాష్ట్ర ఔన్నత్యాన్ని ప్రపంచపటం మీదకు తీసుకెళ్లకుండా, పర్యాటకులను ఆకర్షించకుండా గాలికి వదిలేసిందని భట్టి విక్రమార్క విమర్శించారు. పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 75 ఏళ్లునిండిన వారంతా పదవులకు దూరం

## పార్టీ పదవి నుంచి తప్పకున్న నారాయణ

## సిపిలో కీలకంగా వ్యవహరించిన నారాయణ

హైదరాబాద్,సెప్టెంబర్27(సమయజ్యోతి):



సీపీఐ నారాయణ పార్టీలోని కీలక పదవుల నుంచి తప్పుకున్నారు. గత కొన్ని ఏళ్లుగా సీపీఐ జాతీయ కార్యదర్శిగా వ్యవహరిస్తున్న నారాయణ తన పదవి నుంచి రిటైర్మెంట్ తీసుకున్నారు. పంజాబ్- చండీగఢ్‌లో జరిగిన 25వ సీపీఐ మహాసభల్లో కీలక నిర్ణయాలు జరిగాయి. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజాను మినహాయించి, 75 ఏళ్లు నిండిన వాళ్లందరినీ తప్పించాలని నిర్ణయం తీసుకున్నారు. కొత్త వాళ్లకు అవకాశాలు ఇవ్వడం, యువతకు ప్రాధాన్యత ఇవ్వాలనే అంశాలపై గతంలో విజయవాడలో జరిగిన పార్టీ మహా సభల్లోనే ప్రధానంగా చర్చ జరిగింది. అమలులో కొంత ఆలస్యమైనా మొత్తానికి పంజాబ్ లో జరిగిన మహా సభల్లో కచ్చితంగా అమలు చేయాలని కామ్రేడ్లు అనుకున్నారు. దానికి అనుగుణంగానే 75 ఏళ్లు నిండిన వాళ్లందరినీ కీలక పదవుల నుంచి తప్పించారు. సాధారణంగా జాతీయ కార్యవర్గ సభ్యులు, రాష్ట్రాల కార్యవర్గ సభ్యులు ముఖ్య నాయకులు అందరూ పార్టీకి సంబంధించినటు-వంటి భవిష్యత్తు కార్యాచరణపై, రాజకీయ అంశాలపై నిర్ణయాలు తీసుకుంటారు. అయితే, బయటి రాజకీయాలు కాకుండా పార్టీలో అంతర్గతంగా తలెత్తే సమస్యలను, వాటిని పరిష్కరించే పని కంట్రోల్ కమిషన్ చూస్తుంది. కంట్రోల్ కమిషన్ కు చైర్మన్, సెక్రెటరీ ఉంటారు. మొత్తం 9 మంది సభ్యులు ఈ కమిషన్ లో ఉంటారు. తెలుగు రాష్ట్రాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నారాయణ ఇక క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉంటారు. నారాయణ ప్రజా పోరాటాలతోనే కాదు, తన మాటల తూటాలతోను ప్రజల్లో, పత్రికల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు. సీపీఐ నారాయణ, చికెన్ నారాయణ, అంతేకాదు ఇతర పార్టీలు నారాయణకు ఎన్నో బిరుదులు ఇచ్చాయి. ఎన్నో విమర్శలు కూడా చేశారు. కొన్నిసార్లు అయితే నోరు పారేసుకునే నారాయణ అని కూడా అతడ్ని కామెంట్ చేశారు. అయితే, సీపీఐ నారాయణ మాత్రం ఎప్పుడు తన శైలి మార్చుకోలేదు. ప్రజా సమస్యలపై, ప్రభుత్వాలపై తన మాటల తూటాలతో పేలుస్తూనే ఉండేవాడు. జాతీయ స్థాయిలో గత కొంతకాలంగా పని చేస్తున్న నారాయణ దేశవ్యాప్తంగా పార్టీ కార్యక్రమాలకు హాజరవుతున్న ఎక్కడ ఉన్నా సరే, ప్రతిరోజు కీలక అంశాలపై స్పందిస్తూనే ఉంటారు. అంతెందుకు ముఖ్యమంత్రులు, ప్రధాన మంత్రులు, గవర్నర్లు, రాష్ట్రపతులు ఇలా ఎవరిని సీపీఐ నారాయణ వదల్లేదు.

# హైదరాబాద్ వరద బాధితులకు అండ

## జనసేన కార్యకర్తలకు పవన్ ఆదేశం

హైదరాబాద్,సెప్టెంబర్27(సమయజ్యోతి):



హైదరాబాద్ వరద బాధితులకు అండగా నిలవాలని అభిమానులకు ఏపీ డిప్యూటీ- సీఎం, సినీనటుడు పవన్ కల్యాణ్ సూచించారు. జనసేన తెలంగాణ నాయకులు, శ్రేణులకు ఈమేరకు దిశానిర్దేశం చేశారు. వరద బాధితులకు ధైర్యం చెప్పి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. హైదరాబాద్ సహా తెలంగాణలో భారీవర్షాలు కురుస్తున్నాయని చెప్పారు. మూసీ వరద కారణంగా ఎంజీబీఎస్‌తో పాటు- పరిసరాలు నీటమునిగాయని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే సహాయక చర్యలు చేపట్టిందని వివరించారు. ప్రభుత్వ సూచనలు, వాతావరణ హెచ్చరికలను ప్రజలు అనుసరించాలని సూచించారు

# తెలంగాణ సాధనకు బాటలు వేసిన కొండాలక్ష్మణ్

## జయంతి వేడుకల్లో మంత్రి తుమ్మల

హైదరాబాద్,సెప్టెంబర్ 27(సమయజ్యోతి):

తెలంగాణ రాష్ట్ర సాధనకు బాటలు వేసిన పోరాట యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. శనివారం రవీంద్రభారతిలో జరిగిన కొండా లక్ష్మణ్ బాపూజీ 110వ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ దేశ స్వాతంత్ర్య పోరాటంలో, తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. రాష్ట్ర సాధన కోసం మంత్రి పదవిని త్యజించిన మహనీయుడని కొనియాడారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఒక గొప్ప నాయకుడని, ఆయన తన జీవితాన్ని ప్రజల సేవకే అంకితం చేశారన్నారు. గాంధీజీ సిద్ధాంతాలను ఆచరించి, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన వ్యక్తి అని మంత్రి పేర్కొన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలకు అనుగుణంగా సీఎం రేవంత్ రెడ్డి పాలనసాగిస్తున్నారని, కొండా లక్ష్మణ్ గురించి భవిష్యత్తు తరాలకు తెలిసేలా హార్టికల్చర్ యూనివర్సిటీ-కి, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్ లూమ్ టెక్నాలజీ కి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టామని మంత్రి తుమ్మల తెలిపారు. గతంలో ఎన్నడు లేని విధంగా చేనేత కార్మికుల రుణమాఫీ చేశామని చేనేత రంగాన్ని ప్రోత్సహించటానికి సీఎం రేవంత్ రెడ్డి చొరవతో బతుకమ్మ చీరల వర్క్ ఆర్డర్ తో చేనేత కార్మికులు నిలదొక్కుకునేలా ప్రజా ప్రభుత్వం చేనేత రంగానికి అండగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, కళాకారులు పాల్గొన్నారు.

# బిసి రిజర్వేషన్లపై జివో-హైకోర్టులో విచారణ

హైదరాబాద్,సెప్టెంబర్ 27(సమయజ్యోతి):

బీసీ రిజర్వేషన్ జీవో పై దాఖలైన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు శనివారం విచారణ జరిగింది. పిటిషనర్ తరపున న్యాయవాది మయూర్ రెడ్డి వాదనలు వినిపించారు . అయితే, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. తెలంగాణ ప్రభుత్వం తరుపున వర్చువల్‌గా అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి హాజరయ్యారు. పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం సెక్షన్ 286 కింద 50శాతం మించరాదని పిటిషనర్స్ వాదించారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులు కూడా ఉన్నాయని న్యాయవాది మయూర్ రెడ్డి గుర్తుచేశారు. కాగా, అసెంబ్లీలో బీసీ బిల్ కోసం తీర్మానం చేశామని అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి తెలిపారు. గవర్నర్ దగ్గర బిల్ పెండింగ్‌లో ఉందని చెప్పుకొచ్చారు. అసెంబ్లీ తీర్మానం ఫైనల్ చేసిందని.. అసెంబ్లీకి ఆ అధికారం ఉందని ఏజీ ఉద్ఘాటించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు జరపాలని ప్రభుత్వం చూస్తుందని తెలిపారు. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతి అవసరం లేదని ఏజీ స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఏజీకి 15 నిమిషాలు సమయం ఇచ్చింది హైకోర్టు. ప్రభుత్వం నిర్ణయం చెప్పాలని ఆదేశించింది. అక్టోబర్ 8వ తేదీ వరకు ఎన్నికలు నోటిఫికేషన్ ఇచ్చిన మెరిట్ ప్రకారం కేసు విచారిస్తామని హైకోర్టు స్పష్టం చేసింది.

# శ్రీవారి లయ సిబ్బందికి వస్త్రాలు అందచేసిన వేమిరెడ్డి దంపతులు

తిరుమల,సెప్టెంబర్27(సమయజ్యోతి):

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో సేవలందిస్తున్న శ్రీవారి ఆలయ అర్చకులు, వేదపారాయణదారులు, ఇతర సిబ్బంది, పోటు సిబ్బంది, వాహనం బేరర్లు, మేళం సిబ్బంది, కల్యాణకట్ట క్షురకులకు శనివారం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు వస్త్ర బహుమానం అందజేశారు. తిరుమల వైభవోత్సవ మండపంలో చైర్మన్ బీ.ఆర్.నాయుడు చేతుల మీదుగా వస్త్రాలను అందించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ గత 8 సంవత్సరాలుగా బ్రహ్మోత్సవాల సిబ్బందికి వస్త్ర బహుమానం అందిస్తున్నట్టు- చెప్పారు. స్వామివారి కృపతో సిబ్బందికి వస్త్ర బహుమానం అందించడం అదృష్టంగా భావిస్తున్నామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ పేష్కార్ రామకృష్ణ, పోటు- పేష్కార్ శ్రీ మునిరత్నం, ఇతర అధికారులు పాల్గొన్నారు.





# టెక్నాలజీ ప్రమోషన్‌లో తాను ముందుంటా

## -శక్తివంతమైన వ్యవస్థగా బిఎస్ఎన్ఎల్-మోడీ దూరదృష్టితో అనేక సంస్కరణలు
## -ఆవిష్కరణలకు ఇది అనుకూల సమయం-బీఎస్ఎన్ఎల్ 4జీ సేవల ప్రారంభోత్సవంలో బాబు

విజయవాడ,సెప్టెంబర్27 (సమయజ్యోతి):

బీఎస్ఎన్ఎల్ శక్తిమంతమైన వ్యవస్థగా మారిందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. విజయవాడలో నిర్వహించిన బీఎస్ఎన్ఎల్ 4జీ సేవల ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రపంచం లోనే భారతీయులు శక్తిమంతంగా మారారన్నారు. ప్రధాని మోదీ దూరదృష్టితో అనేక సంస్కరణలు వచ్చాయని చెప్పారు. ప్రధానమంత్రి గ్రీన్ హైడ్రోజన్ తీసుకొస్తే... హైడ్రోజన్ వ్యాలీని అమరావతికి తీసుకొస్తున్నామని తెలిపారు. టెక్నాలజీని ప్రమోట్ చేయడంలో తాను ముందు వరుసలో ఉంటానని వెల్లడించారు. కార్పొరేట్ సర్వీస్, పబ్లిక్ సర్వీస్‌ల్లో 2047 కల్లా ఇండియా నెంబర్ వన్ స్థానంలో ఉంటు-ందని ధీమా వ్యక్తం చేశారు. ఇన్నోవేషన్‌కు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కొవిడ్ సమయంలో వంద దేశాలకు వ్యాక్సిన్ ఇచ్చిన ఘనత మోదీది అని పేర్కొన్నారు. మనం తయారు చేసిన వస్తువులను విదేశాలు వాడే పరిస్థితి తీసుకొచ్చామని వివరించారు. అద్భుత ఆవిష్కరణలు విరివిగా వస్తున్నాయి.. ఎవరూ ఆపలేరు. 2010లో 4జీ, 2020లో 5జీ వచ్చింది..



2030లో 6జీ సేవలు వస్తాయి. ప్రతి పదేళ్లకు ఒకసారి నూతన ఆవిష్కరణలు తోడవుతాయి. బీఎస్ఎన్ఎల్ సేవలు మరింత విస్తృతమయ్యాయి. ప్రైవేటు కంపెనీలకు పోటీ ఇచ్చేలా మెరుగైన సేవలందించారు. దేశంలో ప్రధాని క్వాంటమ్ మిషన్ తీసుకొచ్చారు. మొదటి క్వాంటమ్ కంప్యూటింగ్ అమరావతికి జనవరిలో వస్తుంది. సేఫ్టీ, సెక్యూరిటీ-కావాలంటే క్వాంటమ్ కంప్యూటర్ అవసరం. మోదీ నాయకత్వంలో ఒక పద్ధతి ప్రకారం పనిచేస్తున్నాం. బీఎస్ఎన్ఎల్ నుంచి ఇంకా కొత్త ఆవిష్కరణలు రావాలని చంద్రబాబు తెలిపారు. బీఎస్ఎన్ఎల్ స్వదేశీ 4జీ నెట్‌వర్క్ కింద దేశవ్యాప్తంగా 97,500 టవర్లను ఒడిశా





రాష్ట్రం జార్సుగుడా నుంచి ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. దీనిపై విజయ వాడలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు మాట్లాడారు. దేశాన్ని నడిపించే నాయకుడు లేక ఇన్ని రోజులు అవస్థలు పడ్డామని.. దేశానికి సరైన సమయంలో సరైన నాయకుడు ఉన్నారని ప్రధాని మోదీని కొనియాడారు. ఒకప్పుడు లైటింగ్ కాల్ బుక్ చేస్తే వారం రోజులకు వచ్చేదని సీఎం చంద్రబాబు గుర్తుచేశారు. బీఎస్ఎన్ఎల్ ఒక శక్తివంతమైన ఆర్గనైజేషన్ అని ముఖ్య మంత్రి చంద్రబాబు చెప్పుకొచ్చారు. ప్రధానమంత్రి దూరదృష్టే విజన్ అని ప్రశంసించారు. ఫోన్ అనేది మల్టీపర్పస్ అయిపోయిందని సీఎం తెలిపారు. వాట్సప్ గవర్నెన్స్‌లో 730 సర్వీసులు ఆన్‌లైన్‌లో లభ్యమవు తున్నాయన్నారు. రాబోయే రోజుల్లో స్మార్ట్ ఫోన్ వల్ల జీవన ప్రమాణాలు ఏ విధంగా పెరిగాయనేది తాను రుజువు చేస్తానని చెప్పారు. ఒక్కసారి 4జీ -టె-క్నాలజీ వచ్చిన తర్వాత ఏది అసాధ్యం కాదని స్పష్టం చేశారు. ప్రతీ పది సంవత్సరాలకు టెక్నాలజీ మారుతూనే ఉంటు-ందన్నారు. ప్రపంచానికి మనం టెక్నాలజీ అందించే రోజు వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఎస్ఎన్ఎల్ ఈ దేశానికి దశదిశ నిర్దేశిరచే పరిస్థితి వచ్చిందని తెలిపారు. బీఎస్ఎన్ఎల్ మెరుగైన సేవలు అందించి ప్రజల మన్ననలను పొందిందని వెల్లడించారు. స్పేస్ సిటీలో టెక్నాలజీస్‌ను ప్రమోట్ చేస్తామని ముఖ్యమంత్రి చెప్పారు.

# ఎపి శాసనమండలి నిరవధిక వాయిదా

## పలు బిల్లులకు ఆమోదం తెలిపిన సభ

అమరావతి,సెప్టెంబర్27(సమయజ్యోతి):

ఏపీ శాసనమండలి నిరవధికంగా వాయిదా పడింది. అంతకుముందు ఆరు బిల్లులకు ఆమోదం తెలిపింది. అంతర్జాతీయ వర్సిటీ- ఏర్పాటు బిల్లు-2025ను మండలి ఆమోదించింది. న్యాయవిద్య, పరిశోధన కోసం అమరావతిలో భారత అంతర్జాతీయ వర్సిటీ- ఏర్పాటు- చేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఏపీ ప్రైవేటు- వర్సిటీల (స్థాపన, క్రమబద్ధీకరణ) చట్టం-2025, ఏపీ వర్సిటీ-ల సవరణ బిల్లు-2025ను శాసనమండలి ఆమోదించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కుష్టువ్యాధి అనే పదం తొలగించేందుకు చేసిన చట్టసవరణకు మండలి ఆమోదం తెలిపింది. ఏపీ వ్యవసాయభూమి చట్టం 2006 బిల్లు, ఏపీ పబ్లిక్ సర్వీసులకు నియామకాల నియంత్రణ, వేతన సరళీకరణ బిల్లు-2025, -టె-న్నిస్ క్రీడాకారుడు సాకేత్ సాయిని డిప్యూటీ-కలెక్టర్‌గా నియమించే ప్రతిపాదన కోసం చేసిన చట్టసవరణను సభ ఆమోదించింది. ఏపీ వస్తుసేవల పన్ను బిల్లు-2025కు శాసనమండలి ఆమోదం లభించింది. అనంతరం ఛైర్మన్ మోషేన్ రాజు శాసనమండలిని నివధిక వాయిదా వేశారు.

మాజీమంత్రి పెద్దిరెడ్డి కుటుంబంపై కక్షసాధింపు

# లిక్కర్ కేసులో కావలనే మిథున్ రెడ్డిపై కేసు

## -ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యాఖ్యలు దుర్మార్గం

## జైలులో మిథున్ రెడ్డిని పరామర్శించిన అమర్నాథ్

రాజమండ్రి,సెప్టెంబర్27(సమయజ్యోతి):

కక్ష పూరితంగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబాన్ని ఇబ్బంది పెట్టే కుట్ర జరుగుతోందని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆరోపించారు.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలపై బురదజల్లే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో సంచలనంగా మారిన ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్‌లో ఉన్న ఎంపీ మిథున్ రెడ్డిని ములాఖత్‌లో మాజీ మంత్రి అమర్నాథ్, విజయనగరం జడ్పీ అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ కలిశారు.. ఆ తర్వాత మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై తప్పుడు కేసులు బనాయించి అరెస్టు చేస్తున్నారని అన్నారు. ఇదే విధంగా ఎంపీ మిథున్ రెడ్డిని అక్రమంగా అరెస్టు చేసి కక్ష పూరితంగా ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. కక్ష పూరితంగా పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఇబ్బంది పెట్టడానికి జరిగిన కుట్ర అని ఆరోపించారు. నేరస్తులను బయట విడిచిపెట్టి వారి చెప్పిన పేర్లతో సంబంధం లేని వ్యక్తులను జైల్లో పెడుతున్నారని మండిపడ్డారు. అక్కడ అడ్డా అన్నారు.. ఇక్కడ లిక్కర్ అన్నారు.. ఎందులోనూ అభియోగాలు నిరూపించలేకపోతున్నారని వ్యాఖ్యానించారు అమర్నాథ్.. మరోవైపు, హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటులు నందమూరి బాలకృష్ణ వ్యాఖ్యలపై మండిపడ్డారు.. బాలకృష్ణ వ్యాఖ్యలపై చెలరేగిన దుమారాన్ని డైవర్ట్ చేయడానికి మరొక వైసీపీ నాయకుడు ఎవరో ఒకరిని అరెస్ట్ చేయడానికి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్ నడిపిస్తున్నాయని దుయ్యబట్టారు.. ఎంపీ మిథున్ రెడ్డికి.. ఉత్తరాంధ్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున అండగా ఉంటామని అన్నారు. మిథున్ రెడ్డి జైల్లో ధైర్యంగా ఉన్నారని, ఇటు-వంటి కుట్రలు, అక్రమ కేసులు పెట్టినా ధైర్యంగా ఎదుర్కొందామని చెప్తున్నారని అమర్నాథ్ అన్నారు. మిథున్ రెడ్డికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దతు సంపూర్ణంగా ఉందని తెలిపారు.





# 16న ప్రధాని మోడీ రాక కర్నూలులో జిఎస్టీపై ర్యాలీ

అమరావతి,సెప్టెంబర్27(సమయజ్యోతి):

ప్రధాని నరేంద్ర మోదీ అక్టోబర్ 16న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రానున్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఆయన పర్యటించనున్నారు. శ్రీశైలం మల్లికార్జునస్వామిని ఆయన దర్శించుకోనున్నారు. కర్నూలులో మోదీతో కలిసి కూటమి నేతల రోడ్‌షో ఉండనుంది. జీఎస్టీ సంస్కరణలపై మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఈ మేరకు మోదీ పర్యటన వివరాలను మంత్రి నారా లోకేశ్ శాసనమండలి లాబీలో మంత్రులు, ఎమ్మెల్సీల వద్ద ప్రస్తావించారు.

# కర్నూలు జిల్లాలో భారీ వర్షాలు

## కర్నూలు- గుంటూరు మార్గంలో నిలిచిన రాకపోకలు

## శ్రీశైలం ప్రాజెక్టు పదిగేట్లు ఎత్తి నీటి విడుదల

కర్నూలు,సెప్టెంబర్27(సమయజ్యోతి):

కర్నూలు జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పలు మండలాల్లోని వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఆత్మకూరు మండలంలో సిద్ధాపురం అలుగు పొంగడంతో కర్నూలు- గుంటూరు మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. మరోవైపు గూడూరు తహసీల్దార్ కార్యాలయంలోకి వర్షపు నీరు చేరింది. ఎమ్మిగనూరు పట్టణంలోని గాంధీనగర్ లోతట్టు- ప్రాంతం జలమయం అయింది. ఆదోని పట్టణంలోని రామజల చెరువు పొంగిపొర్లుతోంది. దీంతో సమీపంలోని పంట పొలాలు నీటమునిగాయి. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం మరింత పెరిగింది. జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి వరద పెరుగుతోంది. దీంతో శ్రీశైలం ప్రాజెక్టు పది గేట్లను 12 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో 4,04,658 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రస్తుతం 3,81,392 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ నుంచి 5,000 క్యూసెక్కులు, ఎడమ గట్టు- విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు- విద్యుత్ కేంద్రం నుంచి 30,237 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 883 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీ-ఎంసీలు కాగా.. ప్రస్తుతం 204.35 టీఎంసీలుగా కొనసాగుతోంది.

# రాజకీయ హత్యలో బాధిత కటుంబాలకు అండ

## బాధిత కుటుంబానికి ఉద్యోగంపై ఏకాభిప్రాయం

అమరావతి,సెప్టెంబర్27(సమయజ్యోతి):

రాజకీయ ప్రేరేపిత గొడవల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు ఉద్యోగంపై శాసన మండలిలో చర్చ జరిగింది. బాధిత కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చేందుకు చట్టసవరణ చేసే బిల్లుపై సభ్యులు అభిప్రాయాలను వ్యక్తం చేశారు. పల్నాడులో తోట చంద్రయ్య కుటుంబానికి ఉద్యోగం ఇచ్చే ప్రతిపాదనను వైకాపా తిరస్కరించింది. ఫ్యాక్షన్ నిర్మూలనలో భాగంగానే చట్ట సవరణ చేస్తున్నట్లు- మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. ఈ ప్రతిపాదనను పునఃపరిశీలించాలని విపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. బాధిత కుటు-ంబాలకు భరోసా కోసమే ఉద్యోగం ఇస్తున్నట్లు- పయ్యావుల కేశవ్ తెలిపారు. ఈక్రమంలో చట్టసవరణ బిల్లుపై డివిజన్ కోరుతున్నట్లు- బొత్స సత్యనారాయణ ప్రకటించారు. బిల్లును సమావేశం చివరలో తీసుకుంటామని మండలి ఛైర్మన్ మోషేన్ రాజు తెలిపారు.

# భారీ వర్షాలతో ఉప్పొంగుతున్న కృష్ణాగోదావరులు

అమరావతి,సెప్టెంబర్27(సమయజ్యోతి):

ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణా, గోదావరి నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మొదటి ప్రమాద హెచ్చరికలకు చేరువలో ప్రకాశం, ధవళేశ్వరం బ్యారేజీలు ఉన్నాయి. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఒక ప్రకటన విడుదల చేసింది. భద్రాచలం వద్ద 44.9 అడుగుల నీటిమట్టం ఉండగా.. ధవళేశ్వరం వద్ద ఇన్, ఔట్ ఫ్లో 9.88 లక్షల క్యూసెక్కులుగా ఉంది. వరద ప్రవాహం 11 నుంచి 12 లక్షల క్యూసెక్కుల వరకు చేరే అవకాశం కనిపిస్తోంది. అటు-, కృష్ణానది వరద పరవళ్లు తొక్కుతోంది. ప్రకాశం బ్యారేజి వద్ద ఇన్, ఔట్ ఫ్లో 3.74లక్షల క్యూసెక్కులు ఉంది. 4.5 నుంచి 5 లక్షల క్యూసెక్కుల వరకు వరద ప్రవాహం చేరే అవకాశం ఉందని అధికారులు అంటు-న్నారు. అత్యవసర సహాయం కోసం కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1070, 18004250101కు ప్రజలు ఫోన్ చేయాలని సూచించారు. మరోవైపు నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

# అసెంబ్లీకి రాకుండా జీతాలెలా తీసుకుంటారు

## వైసిపి ఎమ్మెల్యేపై మండిపడ్డ విప్ మాధవిరెడ్డి

అమరావతి,సెప్టెంబర్27(సమయజ్యోతి):



వైసీపీ ఎమ్మెల్యేలపై ప్రభుత్వ విప్ రెడ్డప్పగారి మాధవి రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలోని సమస్యలపై చర్చించేందుకు సభకు రాని వైసీపీ సభ్యుల... జీతాల కోసం మాత్రం దొంగచాటుగా వస్తున్నారంటూ మండిపడ్డారు. ప్రజల పట్ల, వారి సమస్యల పట్ల వైసీపీ ఎమ్మెల్యేలకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాలు మొదలైనప్పటి నుంచి సభకు రాని.. ఆ పార్టీ సభ్యులు జీతాలు తీసుకోడానికి మాత్రం దొంగచాటుగా వస్తారా అంటూ రెడ్డప్పగారి మాధవి రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. వైసీపీ ఎమ్మెల్యేలకు దొంగచాటు- సంతకాలపైనే శ్రద్ధ ఉందంటూ ఎద్దేవా చేశారు. తమ ప్రాంత సమస్యల పరిష్కారం కోసం సభకు రావాలనే చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. జీతాల కోసం మాత్రం దొంగచాటుగా సంతకాలు పెట్టిపోతున్నారని ఫైర్ అయ్యారు. వైసీపీ ఎమ్మెల్యేలు సభలో ఇక దొంగచాటు-గా సంతకాలు పెట్టి తప్పించుకోలేరన్నారన్నారు. ఏఐ ఆధారిత సాఫ్ట్‌వేర్ ద్వారా ఎంతసేపు సభలో ఉన్నారో తెలిసిపోతుందని చెప్పారు. సభకు రాకుండా దొంగ సంతకాలు చేసినవారి జాబితా తమ వద్ద ఉందని ప్రభుత్వ విప్ రెడ్డప్పగారి మాధవిరెడ్డి పేర్కొన్నారు.

# మండలిలో కాఫీ రగడ

## -నాసిరకం కాఫీ ఇస్తున్నారన్న ఛైర్మన్
## -సభలో గొడవకు దిగిన వైకాపా సభ్యులు

అమరావతి,సెప్టెంబర్ 27(సమయజ్యోతి):

ఏపీ శాసనమండలి సమావేశాల్లో కాఫీ విషయంలో రగడ చోటు చేసుకుంది. మండలిలో ఇచ్చే కాఫీకి, అసెంబ్లీలో ఇచ్చే కాఫీకి తేడా ఉంటోందని మండలి ఛైర్మన్ మోషేన్‌రాజు అభ్యంతరం వ్యక్తం చేశారు. శాసనసభలో, మండలిలో ఒకే రకమైన కాఫీ, భోజనాలు లేవంటూ వైసీపీ సభ్యులు ఆందోళనకు దిగారు. దీనిపై శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. శాసనసభ, మండలిలో కాఫీ, భోజనాల విషయంలో తేడా ఎక్కడా లేదని వివరణ ఇచ్చారు. ఎక్కడైనా చిన్న పొరపాట్లు జరిగితే పునరావృతం కాకుండా చూస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అయినప్పటికీ వైసీపీ సభ్యులు తమ ఆందోళనను కొనసాగించారు. ఈ విషయంపై సభలో చర్చ జరపాలంటూ వైసీపీ ఎమ్మెల్సీలు పట్టుబడుతూ సభను స్తంభింపచేశారు. సభలో తీవ్రమైన గందరగోళ పరిస్థితి నెలకొనడంతో ఛైర్మన్ సభను కొద్దిసేపు వాయిదా వేశారు. ఇదిలా ఉండగా... శనివారం ఉదయం శాసన మండలి సమావేశాలు ప్రారంభమయ్యాయి. సభ మొదలవగా ఛైర్మన్ ప్రశ్నోత్తరాలను చేపట్టారు. అయితే వైసీపీ సభ్యుల ఆందోళనతో ప్రశ్నోత్తరాలకు అంతరాయం ఏర్పడింది. ఛైర్మన్‌కు గౌరవం ఇవ్వాలంటూ వైసీపీ ఆందోళనకు దిగింది. ఛైర్మన్‌కు అవమానం అంటూ వైసీపీ సభ్యులు నల్ల కండువాలతో సభకు వచ్చారు . ఈ విషయంలో కల్పించుకున్న మంత్రి పయ్యావుల.. బ్రేక్ సమయంలో ఛైర్మన్ చాంబర్‌లో చర్చిద్దామని అన్నారు. అయితే ముందు చర్చలు జరిపిన తర్వాతే సభ జరుపుదామని విపక్షనేత బొత్స సత్యనారాయణ పట్టుబట్టారు. ఈ క్రమంలో కాసేపు సభలో రగడ చోటు చేసుకుంది.



# కాఫీ గొడవతో చర్చలకు రాని సమస్యలు

## వైకాపా సభ్యుల తీరుపై మండిపడ్డ మంత్రి సంధ్యారాణి

అమరావతి,సెప్టెంబర్27(సమయజ్యోతి):

ఏపీ శాసనమండలిలో కాఫీ రగడపై మహిళ శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి స్పందించారు. కాఫీ, టీల కోసం మండలిలో వైసీపీ దెబ్బలాడటం దౌర్భాగ్యమని మండిపడ్డారు. శాసనసభలో ప్రశ్నలకు వైసీపీకి అవకాశం ఉన్నా రావట్లేదని.. మండలికి వచ్చిన వారు కాఫీ, టీల కోసం దెబ్బలాడటం సిగ్గుచేటంటూ వ్యాఖ్యలు చేశారు. ఇవాళ వైసీపీ కాఫీ, టీ- కోసం చేసిన గొడవ వల్ల మండలిలో ప్రశ్నలే రాకుండా పోయాయని అన్నారు. ప్రభుత్వ భూములు సాగు చేస్తున్న ఎస్టీలకు పట్టాలు ఇచ్చే విలువైన ప్రశ్నకు వైసీపీ తమ కాఫీ గోలతో సభ ముందుకు రాకుండా చేశారని ఫైర్ అయ్యారు. వైసీపీ చంపిన చంద్రయ్య కొడుక్కి ఉద్యోగం ఇవ్వటాన్ని తప్పుపట్టటం దుర్మార్గమన్నారు. వివేకా కూతురు సునీతను వైసీపీ వదిలేసినట్లు-గా.. ప్రాణాలు కోల్పోయిన తమ కార్యకర్తల బిడ్డల్ని వదిలేయలేమని స్పష్టం చేశారు. 'వైసీపీ హయాంలో నేను ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు నా హ్యాండ్ బ్యాగ్ మొత్తం తీసి తనిఖీ చేశారు. ఓ మహిళ సభ్యురాలి హ్యాండ్ బ్యాగ్ తనిఖీ చేయటం ప్రోటోకాలా అంటూ గుమ్మడి సంధ్యారాణి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాగా,శనివారం కాఫీ విషయంలో మండలిలో రగడ చోటు- చేసుకుంది. అసెంబ్లీకి ఒకలా... మండలిలో ఒకలా కాఫీలు, భోజనాలు ఇస్తున్నారంటూ వైసీపీ ఎమ్మెల్సీలు ఆందోళనకు దిగారు. అయితే దీనిపై మంత్రి పయ్యావు మాట్లాడుతూ శాసనసభ, మండలిలో కాఫీ, భోజనాల విషయంలో తేడా ఏం లేదని స్పష్టం చేశారు. అయినప్పటికీ సభ్యులు ఏ మాత్రం వెనక్కి తగ్గకుండా ఆందోళన కొనసాగించారు. దీంతో సభలో గందరగోళ పరిస్థితి నెలకొనడంతో ఛైర్మన్ మోషేన్ రాజు సభను కాసేపు వాయిదా వేయాల్సి ఉంది.

# అమ్మవారిని దర్శించుకున్న బాలయ్య

విజయవాడ,సెప్టెంబర్27(సమయజ్యోతి):

దేశవ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. విజయవాడలోని దుర్గమ్మ ఆలయంలోనూ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇంద్రకీలాద్రిపై ఆరోరోజు దుర్గమ్మ లలితా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఈ క్రమంలో సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, అందుకు దుర్గమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకున్నట్లు- ఆయన తెలిపారు.

# అతి కష్టంగా విజయాన్ని అందుకున్న భారత్


ఆసియా కప్‌లో అత్యంత ఉత్కంఠగా జరిగిన సూపర్-4 మ్యాచ్‌లో భారత జట్టు చెమటోడ్చింది. అతి కష్టంగా విజయాన్ని అందుకోగా.. హ్యాట్రిక్ ఓటమితో శ్రీలంక స్వదేశం చేరింది. ఆసియా కప్‌లో ఫేవరేట్ జట్టుగా బరిలోకి దిగిన భారత్‌కు వరుస భారీ షాక్‌లు ఎదురవుతున్నాయి. ఆఖరి గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లో పసికూన ఒమన్ చేతిలో ఓడిపోయే మ్యాచ్‌ను కాపాడుకుని టీమిండియా పరువు నిలబెట్టుకుంది. సూపర్ 4 లో శ్రీలంకతో పోరాడి విజయాన్ని అందుకుంది. ఆసియా కప్ ఫైనల్ ముంగిట ఇలా భారత్ విపత్కర పరిస్థితులు ఎదుర్కోవడం సవాల్‌గా మారింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో ఫైనల్‌లో ఎలా ఆడుతుందోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దుబాయ్‌లో జరుగుతున్న ఆసియా కప్‌లో భాగంగా సూపర్ 4లో శనివారం భారత్, శ్రీలంక బరిలోకి దిగాయి. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 202 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ మరోసారి అర్ధ సెంచరీతో చెలరేగి ఆడాడు. 31 బంతుల్లో 61 పరుగులు చేయగా.. తెలంగాణ పోరడు తిలక్ వర్మ 34 బంతుల్లో 49 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. కొద్దిలో అర్ధ సెంచరీని కోల్పోయాడు. సీనియర్ ఆటగాడు సంజూ శామ్‌సన్ 39 స్కోర్‌తో పర్వాలేదనిపించగా.. మిగిలిన బ్యాటర్లు తలా కొన్ని పరుగులు చేశారు. చరిత్ హసలంక, దసున్ శనక, మహీశ్ తీక్షణ ఒక్కో వికెట్ పడగొట్టారు.భారీ లక్ష్య ఛేదనకు దిగిన శ్రీలంక అద్భుతంగా పోరాడింది. చివరి బంతి వరకు విజయం కోసం శ్రమించి స్కోర్‌ను సమం చేసింది. 20 ఓవర్లకు 5 వికెట్లు కోల్పోయి 202 పరుగులు చేసి మ్యాచ్‌ను డ్రాగా ముగించింది. పాథుమ్ నిస్సాంక సెంచరీతో దుమ్మురేపాడు. భారత బౌలర్లను ఉతికి ఆరేశాడు. 58 బంతుల్లో 107 పరుగులు చేసి నిస్సాంక అనేక రికార్డులు నమోదు చేశాడు. అతడికి తోడుగా కుశాల్ పెరెరా 32 బంతుల్లో 58 పరుగులు తీసి గొప్ప సహకారం అందించాడు. శనక 22 పరుగులతో నాటౌట్‌గా నిలిచి స్కోర్‌ను సమం చేశాడు. భారత బౌలర్లు స్కోర్‌ను కాపాడడంలో విఫలమయ్యారు. హార్దిక్ పాండ్యా, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్ ఒక్కో వికెట్ తీశారు. స్కోర్లు సమం కావడంతో సూపర్ ఓవర్ నిర్వహించగా శ్రీలంక స్కోర్ తీయడంలో విఫలమైంది. అర్ష్‌దీప్ అద్భుతంగా బౌలింగ్ చేయడం బరిలోకి దిగిన శ్రీలంక ఒక్క పరుగే చేయగా.. ఒక వైడ్‌తో మొత్తం రెండు పరుగులు చేసింది. బ్యాట్ అందుకున్న సూర్య కుమార్ తొలి బంతికే మూడు పరుగులు తీయడంతో భారత్ విజయం సాధించింది. గెలవాల్సిన మ్యాచ్‌లో భారత్ ఇంతగా పోరాడడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఇప్పటికే ఫైనల్ ఆసియా కప్‌ను అందుకుంటుందని అందరూ భావిస్తుండగా పసికూన ఒమన్‌తోపాటు ఇప్పుడు శ్రీలంక నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురవడంపై భారత జట్టు దృష్టి సారించాల్సి ఉంది. బౌలింగ్ దళం పటిష్టం కావాల్సి ఉంది. మరి రేపు జరగనున్న ఆసియా కప్ ఫైనల్‌లో భారత్ ఎలా ఆడుతుందనేది ఉత్కంఠ నెలకొంది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లో ఓడించిన భారత్ ఫైనల్‌లో కూడా అదే చేయాలని యావత్ భారతావని కోరుతోంది.






## శ్రీలంకతో మ్యాచ్‌ను ఫైనల్‌గానే భావించా

### టీమ్‌ఇండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్



ఆసియా కప్ 2025 ఫైనల్‌లో భారత్, పాకిస్థాన్‌ను ఢీకొట్టేందుకు సిద్ధమైంది. అయితే అంతకుముందు జరిగిన సూపర్-4 చివరి మ్యాచ్‌లో శ్రీలంకతో తలపడింది. ఉత్కంఠగా సాగిన ఈ పోరు సూపర్ ఓవర్‌కు చేరగా భారత్ విజయాన్ని సొంతం చేసుకుంది. ఫైనల్‌కు సన్నాహకంగా భావించిన ఈ మ్యాచ్‌లో శ్రీలంక నుంచి టీమ్‌ఇండియాకు గట్టి పోటీ ఎదురైంది. ఇప్పటివరకు ఈ టోర్నీలో పెద్దగా పోటీ లేకపోవడంతో శ్రీలంక దాదాపు గెలిచేలా కనిపించింది. అయితే చివర్లో అర్ష్‌దీప్ సింగ్ వేసిన సూపర్ ఓవర్ మ్యాజిక్‌తో భారత్ విజయాన్ని దక్కించుకుంది. ఈ సందర్భంగా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తన సహచరులపై ప్రశంసలు కురిపించడమే కాకుండా, ఫైనల్ సన్నద్ధతపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌ను తాను ఫైనల్‌గానే భావించానని సూర్యకుమార్ యాదవ్ వెల్లడించాడు. "రెండో ఇన్నింగ్స్ సగం ముగిసిన తర్వాత మా ఆటగాళ్లు పుంజుకున్న తీరు అద్భుతం. దీన్ని సెమీఫైనల్‌గా ఆడాలని వారికి చెప్పా. అదే జోష్‌తో మ్యాచ్‌ను ముగించాం. బ్యాటింగ్‌లో మంచి ఆరంభం లభించాక మిడిల్ ఓవర్లలో తిలక్ వర్మ, సంజు శాంసన్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు" అని సూర్య ప్రశంసించాడు. బౌలింగ్‌లో అద్భుత ప్రదర్శన చేసిన అర్ష్‌దీప్‌పై ప్రత్యేకంగా మాట్లాడాడు. "అర్ష్‌దీప్ సత్తా ఏంటో మనందరికీ తెలుసు. గత మూడేళ్లుగా అతడు టాప్ బౌలర్‌గా కొనసాగుతున్నాడు. ఐపీఎల్‌లోనూ అదరగొట్టాడు. అతడికంటే మరెవరు సూపర్ ఓవర్‌ను ఇంత అద్భుతంగా వేయగలరు?" అని ప్రశంసల వర్షం కురిపించాడు.

శ్రీలంకతో మ్యాచ్ సందర్భంగా కొందరు ఆటగాళ్లు కండరాలు పట్టేయడంతో ఇబ్బందిపడినట్లు సూర్య వెల్లడించాడు. "వారు తప్పకుండా ఆదివారం నాటి ఫైనల్ మ్యాచ్‌కు సిద్ధంగా ఉంటారని భావిస్తున్నా. శ్రీలంకతో ఎంత దూకుడుగా ఆడామో ఫైనల్‌లోనూ అదే దూకుడు ప్రదర్శిస్తాం. మా కుర్రాళ్ల నుంచి నేను కోరుకొనేది ఒక్కటే! వారి ప్రణాళికలను అనుకున్నట్లుగా అమలుచేయండి. స్పష్టతతో ఉండండి, నిర్భయంగా ఆడేయండి. ఫైనల్‌లో ఆడబోతున్నందుకు సంతోషంగా ఉంది" అని సూర్య విశ్వాసం వ్యక్తం చేశాడు.శ్రీలంక యువ ఆటగాడు దునిత్ వెల్లలాగేకు ఇటీవల పితృవియోగం కలిగింది. ఆసియా కప్‌లో ఆడుతున్నప్పుడే అతడి తండ్రి గుండెపోటుతో కన్నుమూశారు. అంత్యక్రియలకు వెళ్లి వచ్చిన దునిత్ వెంటనే జట్టుతో చేరాడు. భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో అతడు బెంచ్‌కే పరిమితమయ్యాడు. మ్యాచ్ అనంతరం సూర్యకుమార్ యాదవ్ ప్రత్యేకంగా వెల్లలాగే వద్దకు వెళ్లి మాట్లాడి ఓదార్చాడు. సూర్య ఆడిన ఈ మాటలు, ఓదార్చే వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.దిలా ఉండగా ఆసియా కప్‌లో భాగంగా శ్రీలంకతో జరిగిన సూపర్ ఓవర్ మ్యాచ్‌లో భారత్ సత్తా చాటింది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా 202/5 పరుగులు చేసింది. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 202 పరుగులు చేసింది. అనంతరం మ్యాచ్ సూపర్ ఓవర్?కు వెళ్లడంతో ఫలితం తేలింది. సూపర్ ఓవర్‌లో అర్ష్‌దీప్ 5 బంతుల్లో కేవలం 2 పరుగులే చేసి 2 వికెట్లు తీశాడు. ఆ తర్వాత భారత్ తరఫున బ్యాటింగ్? వచ్చిన కెప్టెన్ సూర్య కుమార్? తొలి బంతికే 3 పరుగులు చేయడంతో భారత్? విజయం సాధించింది.

## అభిషేక్, హార్దిక్‌కు గాయాలు!

ఆసియా కప్ 2025 ఫైనల్‌లో భారత్ పాకిస్థాన్‌తో ఆదివారం తలపడనున్న నేపథ్యంలో టీమ్‌ఇండియాకు గాయాల రూపంలో ఊహించని షాక్ తగిలినట్లు వార్తలు వస్తున్నాయి. భారత్‌కు కీలకమైన ఇద్దరు ఆటగాళ్లు ఓపెనర్ అభిషేక్ శర్మ, స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య గాయాల కారణంగా ఇబ్బందులు పడుతున్నారని సమాచారం. అయితే వీరిద్దరూ ఫైనల్‌కు అందుబాటులో ఉంటారని బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ తెలిపారు. శ్రీలంకతో జరిగిన సూపర్ 4 చివరి మ్యాచ్‌లో భారత్ విజయాన్ని ఖాతాలో వేసుకుంది. అయితే ఆ మ్యాచ్‌లో అభిషేక్ శర్మ ఫీల్డింగ్‌కు రాకపోవడం, హార్దిక్ పాండ్య కేవలం ఒక్క ఓవర్ మాత్రమే వేసి అటుపై బౌలింగ్‌కు రాకపోవడం అభిమానుల్లో సందేహాలు రేకెత్తించింది. దీనిపై స్పష్టతనిచ్చిన మోర్కెల్, చిన్నపాటి క్రాంప్స్ వల్లే ఇలాంటి పరిస్థితి తలెత్తిందన్నారు. 'హార్దిక్‌కు దుబాయ్ వాతావరణం ఇబ్బందిగా మారింది. కండరాలు పట్టేయడంతో మళ్లీ బౌలింగ్ చేయలేదు. కానీ అది పెద్ద గాయం కాదు.



## పాకిస్థాన్ ఫైనల్ లో ఓడితే 1.30 కోట్ల నష్టం



ఆసియా కప్ 2025లో ఇప్పటికే ఆరుసార్లు విజయం సాధించిన టీం ఇండియా.. ఇప్పుడు పాకిస్థాన్‌పై మరో విజయం సాధించాలని ఆసక్తిగా ఉంది. రెండు జట్ల మధ్య ఫైనల్ పోరు సెప్టెంబర్ 28న దుబాయ్‌లో జరగనుంది. ఈ టోర్నమెంట్‌లో భారత్ రెండుసార్లు పాకిస్థాన్‌ను ఓడించింది. ఇప్పుడు భారత జట్టు పాకిస్థాన్‌పై హ్యాట్రిక్ విజయాలు సాధించడానికి సిద్ధమవుతోంది. పాకిస్థాన్ ఫైనల్ మ్యాచ్‌లో ఓడిపోతే దాదాపు రూ.1.30 కోట్ల నష్టాన్ని చవిచూడాల్సి రావొచ్చు. ఈ సమయంలో, టీం ఇండియా ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ అభిషేక్ శర్మకు రూ.75 లక్షలు సంపాదించే గొప్ప అవకాశం ఉంది. 2025 ఆసియా కప్ గెలిచిన జట్టుకు భారీ మొత్తంలో నగదు అందుతుంది. 2023 ఆసియా కప్‌తో పోలిస్తే ప్రైజ్ మనీ 50 శాతం పెరిగిందని నివేదికలు సూచిస్తున్నాయి. గెలిచిన జట్టుకు దాదాపు రూ. 2.6 కోట్లు (260 మిలియన్స్), ఓడిపోయిన జట్టుకు రూ. 1.3 కోట్లు (130 మిలియన్స్) అందుతాయని నివేదికలు సూచిస్తున్నాయి.ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డు గెలుచుకున్న ఆటగాడికి రూ. 50 లక్షలు అందుతాయి. ఇంకా, ఫైనల్‌లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డుకు రూ. 20 లక్షలు అందుతాయి. బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాట్స్‌మన్‌కు ఒక్కొక్కరికి రూ. 25 లక్షలు అందుతాయి. అయితే, ఆసియా క్రికెట్ కౌన్సిల్ ఈ మొత్తాన్ని ధృవీకరించలేదు. ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ రేసులో టీం ఇండియా ఓపెనర్ అభిషేక్ శర్మ ముందున్నాడు.2025 ఆసియా కప్‌లో అత్యధిక పరుగులు చేసిన అభిషేక్ శర్మ, ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌కు బలమైన పోటీదారుగా పరిగణిస్తున్నాడు. శర్మ ఇప్పటివరకు టోర్నమెంట్‌లో ఆరు మ్యాచ్‌లు ఆడి, 51.50 సగటుతో 309 పరుగులు చేశాడు. వాటిలో మూడు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. శ్రీలంక ఓపెనర్ పాతుమ్ నిస్సాంక ఆరు మ్యాచ్‌ల్లో 43.50 సగటుతో 261 పరుగులు చేసి రెండవ స్థానంలో ఉన్నాడు. ఇందులో ఒక సెంచరీ, రెండు అర్ధ సెంచరీలు ఉన్నాయి.అభిషేక్ శర్మకు ఉత్తమ బ్యాట్స్‌మన్ అవార్డు ఖాయమైంది. అతను ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా కూడా ఎంపికయ్యే అవకాశం ఉంది. ఫైనల్ మ్యాచ్‌లో దాదాపు రూ. 75 లక్షలు (సుమారు %వి%7.5 మిలియన్లు) సంపాదిస్తాడు. అయితే, కుల్దీప్ యాదవ్ అభిషేక్‌కు ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డు కోసం గట్టి పోటీ ఇస్తున్నాడు. ఇప్పటివరకు టోర్నమెంట్‌లో అతను అత్యధిక వికెట్లు తీసుకున్నాడు.ఇప్పటివరకు ఆరు మ్యాచ్‌ల్లో 13 వికెట్లు తీసిన టీం ఇండియా స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ ఉత్తమ బౌలర్ అవార్డును గెలుచుకునే అవకాశం ఉంది. యుఎఇకి చెందిన జునైద్ సిద్ధిఖీ తొమ్మిది వికెట్లతో రెండవ స్థానంలో ఉన్నాడు. పాకిస్తాన్ ఫాస్ట్ బౌలర్ షాహీన్ షా అఫ్రిది ఆరు మ్యాచ్‌ల్లో తొమ్మిది వికెట్లు తీసి జాబితాలో మూడవ స్థానంలో ఉన్నాడు. ఈ జాబితాలో అతను రెండవ స్థానంలో నిలిచే అవకాశం ఉంది.

## భారత ఆర్చర్ శీతల్ దేవి స్వర్ణ పతకం



వరల్డ్ పారా ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో భారత ఆర్చర్ శీతల్ దేవి స్వర్ణ పతకం సాధించింది. ఈ విజయంతో సరికొత్త చరిత్రను లిఖించింది. సౌత్‌కొరియాలోని గ్వాంగ్జు వేదికగా జరుగుతున్న వరల్డ్ పారా ఆర్చరీ 2025 ఛాంపియన్‌షిప్‌లో మహిళల వ్యక్తిగత కాంపౌండ్ విభాగంలో శీతల్ దేవి విజేతగా నిలిచి స్వర్ణం పతకం గెలిచింది. పుట్టకతోనే చేతులు లేకున్నా.. శీతల్ దేవి కాళ్లు, నోటి సాయంతో విల్లు విసరగలదు. ఫైనల్లో వరల్డ్ నెంబర్ వన్ ప్లేయర్‌ను శీతల్ దేవి ఓడించింది. ఉత్కంఠగా సాగిన ఈ ఫైనల్లో శీతల్ దేవి 146-143 తేడాతో టర్కీకి చెందిన వరల్డ్ నంబర్ వన్ పారా ఆర్చర్ ఓజ్నూర్ క్యూర్ కీర్తిని ఓడించింది. తొలి రౌండ్ 29-29తో టై కాగా.. రెండో రౌండ్‌లో శీతల్ దేవి మూడు పర్ఫెక్ట్ 10 పాయింట్స్ సాధించి ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.ఆ తర్వాత చివరి వరకు అదే ఆధిక్యాన్ని కొనసాగించింది. ఆఖరి రౌండ్‌లోనూ మూడు సార్లు 10 పాయింట్స్ సాధించి విజయాన్ని ఖాయం చేసుకుంది. ఈ ఛాంపియన్‌షిప్‌లో శీతల్ దేవి సాధించిన మూడో పతకం ఇది. గతంలో ఆమె దోమన్ కుమార్‌తో కలిసి మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో కాంస్య పతకం, సరితతో కలిసి మహిళల కాంపౌండ్ టీమ్ విభాగంలో సిల్వర్ మెడల్ గెలుచుకుంది. అంతేకాకుండా 2023 వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఫైనల్లో ఓస్నూర్ క్యూర్ కీర్తిపై ఎదురైన పరాజయానికి తాజా విజయంతో ప్రతీకారం తీర్చుకుంది.



## కుల్దీప్ యాదవ్ అద్భుతమైన ఫామ్

ప్రస్తుతం జరుగుతున్న ఆసియా కప్ 2025లో భారత స్టార్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలోని టీమిండియా ఈ టోర్నమెంట్‌లో అజేయంగా దూసుకుపోతోంది. ఫైనల్‌లో పాకిస్తాన్‌తో తలపడనుంది. శ్రీలంకతో జరిగిన చివరి సూపర్ ఫోర్ మ్యాచ్‌లో భారత్ విజయం సాధించడంలో కుల్దీప్ కీలక పాత్ర పోషించాడు. ప్రస్తుతం జరుగుతున్న ఆసియా కప్ 2025లో భారత స్టార్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ తన అద్భుతమైన ఫామ్‌తో అందరినీ ఆకట్టుకుంటున్నాడు. సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలోని టీమిండియా ఈ టోర్నమెంట్‌లో ఏ ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా దూసుకుపోతోంది. ఫైనల్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో టైటిల్ కోసం తలపడనుంది. శ్రీలంకతో జరిగిన చివరి సూపర్ ఫోర్ మ్యాచ్‌లో బ్లూ టీమ్ ఒక సంచలన విజయాన్ని నమోదు చేసుకుంది. ఈ మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారితీసింది, అక్కడ భారత్ మూడు పరుగులు ఛేదించి విజయం సాధించింది. శ్రీలంకపై భారత్ సాధించిన ఈ విజయంలో ప్రధాన హైలైట్‌లలో ఒకటి స్టార్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ అద్భుత ప్రదర్శన. నాలుగు ఓవర్లు బౌలింగ్ చేసిన కుల్దీప్, 31 పరుగులు ఇచ్చి ఒక వికెట్ పడగొట్టాడు. ఈ ప్రదర్శనతో 30 ఏళ్ల కుల్దీప్, ప్రస్తుత ఆసియా కప్ 2025లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు.ఈ మ్యాచ్‌కు ముందు కుల్దీప్, అమ్జద్ జావేద్ చెరో 12 వికెట్లతో టోర్నమెంట్‌లో సంయుక్తంగా అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లుగా ఉన్నారు. అయితే, శ్రీలంక మ్యాచ్‌లో కుల్దీప్ తీసిన ఒక వికెట్‌తో అతని మొత్తం వికెట్ల సంఖ్య 13కి చేరుకుంది, దీంతో అతను ఇప్పుడు ఒంటరిగా టాప్ స్థానంలో ఉన్నాడు. ఫైనల్‌లో కూడా కుల్దీప్ మాయాజాలం కొనసాగితే, భారత్‌కు తిరుగుండదు.2025 ఆసియా కప్ చివరి గేమ్ అయిన శ్రీలంకపై సూపర్-ఓవర్ విజయం సాధించిన తర్వాత, భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తన జట్టు ప్రదర్శనపై మాట్లాడారు.

# ఈ అవకాశం కలలో కూడా ఊహించలేదు

## కాంతారా చాప్టర్-1 నటి రుక్మిణీ వసంత్



'కాంతార చాప్టర్ 1'లో నటించే అవకాశం వస్తుందని నేను కలలో కూడా ఊహించలేదని నటి రుక్మిణీ వసంత్ అన్నారు. 'కాంతార చాప్టర్ 1'తో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు నటి రుక్మిణి వసంత్. రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో రానున్న ఈ చిత్రం అక్టోబర్ 1న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో వరుస ఇంటర్వ్యూలతో బిజీగా ఉన్నారు. నేను నటించిన 'సప్తసాగరాలు దాటి', 'ఏస్' చిత్రాలను రిషబ్ శెట్టి చూశారు. వాటి ప్రీమియర్స్‌కు వచ్చి నా నటనను మెచ్చుకున్నారు. ఇదంతా ఆయన నా ప్రీమియర్స్ చూసి ఇందులో ఛాన్స్ ఇచ్చారని నేను భావిస్తున్నా. కాంతార టీ-మ్ నాకు ఫోన్ చేసి ఇందులో భాగం అవుతారా అని అడిగినప్పుడు నా ఆనందాన్ని మాటల్లో వర్ణించలేను. ఈ సినిమా 4,5 శతాబ్దాల మధ్య జరిగే కథ. అప్పటి పరిస్థితులకు తగినట్లు- వాటిని అర్థం చేసుకుంటూ నటించాలి. అలాగే దీనికోసం గుర్రపు స్వారీ, కత్తి యుద్ధంలలో శిక్షణ పొందడం ఎంతో సరదాగా అనిపించింది. కొన్ని యాక్షన్ సన్నివేశాలు చేశానని రుక్మిణి తెలిపారు. కొన్ని సందర్భాల్లో రిషబ్ శెట్టిని చూసి ఆశ్చర్యపోయినట్లు- తెలిపారు. నటు-డిగా, దర్శకుడిగా ఆయన ప్రతి విషయాన్ని క్షుణంగా పరిశీలిస్తారని ప్రశంసలు కురిపించారు. ఇక తాను ఎన్టీఆర్ - ప్రశాంత్ నీల్ కాంబోలో రానున్న సినిమా, యశ్ టాక్సిక్ గురించి ఇప్పుడే ఏం చెప్పలేనని అన్నారు. తాను కెరీర్‌లో ఏ ఆఫర్‌నూ వదులుకోలేనని చెప్పారు.

# ట్రిపుల్ ఎక్స్..సీక్వెల్‌లో దీపికా పదుకొణె



తంపాకంలు.. అమ్మాయిలు.. రెండూ ఒకటే. ధైర్యంగా ప్రపంచాన్ని ఎదుర్కొంటాయి అంటూ 'ట్రిపుల్ ఎక్స్: రిటర్న్ ఆఫ్ జాండర్ కేజ్' అనే తన తొలి హాలీవుడ్ సినిమాతో అదరగొట్టింది బాలీవుడ్ తార దీపికా పదుకొణె. డీజే కరుసో తెరకెక్కించారు. ఈ స్పై యాక్షన్ చిత్రంలో విన్ డీసెల్, నినా డోబ్రేవ్, రూబీ రోజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. 2017లో విడుదలై భారీ వసూళ్లతో రికార్డు సృష్టించిన ఈ సినిమాకు ఇప్పుడు సీక్వెల్ రాబోతున్నట్లు- తెలుస్తోంది. ఇందులో కూడా దీపికా పదుకొణె భాగం కానున్నట్లు- సమాచారం. ఈ కొనసాగింపు సినిమా చిత్రీకరణను దీపిక కోరిక మేరకు ముంబయిలో ప్రారంభించాలని సన్నాహాలు చేస్తుంది చిత్రబృందం. తన కుమార్తె కోసం ఆమె ఈ నిర్ణయం తీసుకుంది. త్వరలో దీనికి సంబంధించిన వివరాల్ని అధికారికంగా వెల్లడించనున్నారని దీపిక సన్నిహిత వర్గాలు తెలిపాయి. మరి మరోసారి హాలీవుడ్‌లోకి అడుగుపెట్టనున్న ఆమె సందడి ఎలా ఉంటుందో చూడాలంటే కొన్ని రోజులు ఎదురుచూడాల్సిందే.

# శరవేగంగా లెనిన్ చిత్రీకరణ శ్రీలీల ప్లేస్‌లో భాగ్యశ్రీ

అఖిల్ అక్కినేని హీరోగా వస్తున్న చిత్రం లెనిన్. వినరో భాగ్యం విష్ణు కథా ఫేమ్ మురలీ కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది.ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంట్టంల్గ÷ న్మెంట్స్ బ్యానర్ పై నాగవంశీ నిర్మిస్తున్నారు. ఆ మధ్య రిలీజ్ లెనిన్ గ్లిమ్స్ సినిమాపై ఆడియెన్స్ లో క్యూరియాసిటిని పెంచింది. అలాగే ఈ సినిమాలో హీరోయిన్ గా మొదట శ్రీలీలను తీసుకున్నారు మేకర్స్. కొంత పోర్షన్ షూటింగ్ కూడా చేసారు. కానీ బాలీవుడ్ సినిమా కోసం లెనిన్ కు డేట్స్ ఇవ్వడంలో డిలే చేస్తుండడంతో ఆమెను ఈ సినిమా నుండి తప్పించి ఆ పోర్షన్ ను రీ షూట్ చేసారు మేకర్స్. శ్రీలీలతో కేవలం ఎనిమిది రోజుల షూట్ మాత్రమే చేసారు. ఆమె ప్లేస్ లో భాగ్యశ్రీ బోర్స్ ని అఖిల్ సరసన హీరోయిన్ గా తీసుకున్నారు. భారీ బడ్జెట్ పై తెరకెక్కుతున్న ఈ యాక్షన్ డ్రామా ఇప్పటికే 80శాతం షూటింగ్ పూర్తయింది, చివరి షెడ్యూల్ ఈ నెలలో ప్రారంభమవుతుంది. -క్లైమాక్స్ సన్నివేశాలతో పాటు- ప్యాచ్ వర్క్ ను అక్టోబర్ నాటికి ఫినిష్ చేసేలా షెడ్యూల్ ప్లాన్ చేసారు. ఎట్టి పరిస్థితు ల్లోనూ ఈ ఏడాది రిలీజ్ చేయాలని భావి స్తున్నారు. వినిపిస్తున్న సమాచారం ప్రకారం ఈ ఏడాది నవంబరు 17న లెనిన్ ను రిలీజ్ చేసే ఆలోచనలో ఉన్నట్టు- తెలుస్తోంది. అందుకు అనుగుణంగానే షూటింగ్ ను జెట్ స్పీడ్ లో చేస్తున్నారు మేకర్స్. ఈ సినిమాతో ఎలాగైనా హిట్ కొట్టాలని అఖిల్ పట్టుదలగా ఉన్నాడు.



# ది ప్యారడైజ్ మూవీలో మోహన్‌బాబు

కథానాయకుడు నాని - దర్శకుడు శ్రీకాంత్ ఓదెల మరోసారి ది ప్యారడైజ్ మూవీలో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే. 'ది ప్యారడైజ్' అంటూ విభిన్న కథతో రానున్నారు. ఈ సినిమాలో అగ్ర నటుడు మోహన్ బాబు ఉన్నట్లు ఎప్పటినుంచో వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఆయన లుక్‌ను రిలీజ్ చేశారు. ఇందులో మోహన్‌బాబు 'శికంజ మాలిక్'గా కనిపించనున్నట్లు తెలుపుతూ పోస్టర్ విడుదల చేశారు. షర్ట్ లేకుండా గన్, కత్తి పట్టుకుని సిగార్ కాలుస్తూ రగ్గడ్ లుక్‌లో మోహన్‌బాబు కనిపిస్తున్నారు. ఆయన పవర్‌ఫుల్ విలన్‌గా నటిస్తున్నట్లు- చిత్రబృందం తెలిపింది. ఇక ఇందులో నాని కూడా ఇప్పటివరకూ చూడని డిఫరెంట్ లుక్‌లో కనిపించనున్న విషయం తెలిసిందే. నాని 'జడల్' పాత్రలో కనిపించనున్నారు. వచ్చే ఏడాది మార్చి 26న ఈ సినిమా ప్రేక్షకులను పలకరించనుంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, బెంగాలీతోపాటు-... మొత్తం 8 భాషల్లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. తిరుగుబాటు-, నాయకత్వంతో పాటు- తల్లీకొడుకుల అనుబంధం కథకు కీలకంగా నిలవనున్నట్లు- ఇప్పటివరకూ విడుదలైన ప్రచార చిత్రాలు చూస్తే అర్థమవుతుంది.



# గాడ్ ఆఫ్ ఫియర్...దేవర-2 పై అధికారిక ప్రకటన

యంగ్ -టైగర్ ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో వచ్చిన చిత్రం దేవర. గతేడాది సెప్టెంబర్ 27న రిలీజ్ అయిన ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచింది. రూ. 500 కోట్లకు పైగా వసూళ్లు సాధించి కొరటాలకు సూపర్ కంబ్యాక్ సినిమాగా నిలిచింది. అలాగే బాలీవుడ్ హాట్ బ్యూటీ- జాన్వీ కపూర్ కు టాలివుడ్ లో తొలి సినిమాతోన బ్లాక్ బస్టర్ ను తన ఖాతలో వేసుకుంది. రాజమౌళి సెంటిమెంట్ ను సైతం బ్రేక్ చేసిన హీరోగా ఎన్టీఆర్ సెన్సేషన్ చేసారు. కాగా ఈ సినిమాకు సీక్వెల్ ఉంటుందని గతంలోనే ప్రకటించారు. అయితే ఎన్టీఆర్ లైనప్ ను పరిశీలిస్తే దేవర 2 ఉండదనే చర్చ నడించింది. కానీ ఎట్టి పరిస్థితుల్లో దేవర 2 ఉంటుందని ప్రకటించడంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుషి అయ్యారు. ఇదిలా ఉండగా నేడు ఈ సినిమా రిలిజ్ అయి సంవత్సరం అయిన సందర్భంగా దేవర 2 గురించి కీలక ప్రకటన చేసారు మేకర్స్. ఈ సారి గాడ్ ఆఫ్ ఫియర్ రాబోతున్నాడు దేవర 2 కు రెడీ అవండి అని అఫీషియల్ గా అనౌన్స్ చేశారు. ఈ ప్రకటనతో నందమూరి ఫ్యాన్స్ జోష్ రెట్టింపయింది. ఎన్టీఆర్ ప్రస్తుతం ప్రశాంత్ నీల్ సినిమా షూటింగ్ లో బిజీగా ఉన్నారు. ఆ తర్వాత జైలర్ డైరెక్టర్ నెల్సన్ తో సినిమా చేయాల్సి ఉంది. అలాగే త్రివిక్రమ్ తో కూడా సినిమా చేయబోతున్నాడు. మరి ఈ గ్యాప్ లో దేవర 2 ను ఎన్టీఆర్ ఎప్పుడు స్టార్ట్ చేస్తాడో చూడాలి. మరోవైపు దర్శకుడు కొరటాల దేవర 2 స్క్రిప్ట్ వర్క్ ను ఫినిష్ చేసే పనిలో ఉన్నాడు.

# తుదిదశకు ది రాజాసాబ్ మూవీ చిత్రీకరణ

## 1న ట్రైలర్ విడుదల చేసే ఛాన్స్

ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం ది రాజా సాబ్ మారుతి దర్శకత్వంలో రాబోతుండగా.. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని డిసెంబర్5 ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు మేకర్స్. ఇప్పటికే ఈ సినిమా నుంచి టీజర్‌ను విడుదల చేసిన చిత్రబృందం తాజాగా ట్రైలర్‌ను విడుదల చేయబోతుందని తెలుస్తుంది. ఈ సినిమా ట్రైలర్‌ను దసరా కానుకగా.. అక్టోబర్ 1 న విడుదల చేయబోతున్నట్లు- సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ సినిమాలో ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ కథానాయికలుగా నటించారు. బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ కీలక పాత్ర పోషించారు. సప్తగిరి వీటీ-వీ గణేష్, ప్రభాస్ శ్రీనుతో పాటు- బొమ్మన్ ఇరానీ తదితరులు ఇతర కీలక పాత్రలలో కనిపించనున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకం మీద టీ-జీ విశ్వప్రసాద్, ఆయన కుమార్తె కృతి ప్రసాద్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.







EDITED, PRINTED AND PUBLISHED BY FAISAL KHAN PRINTED AT UJALA PRESS, LIG, 211 APHB COLONY ADILABAD, TELANGANA.
PUBLISHED FROM H.NO.4-4-120/C/3, SANJAY NAGAR COLONY, ADILABAD, TELANGANA STATE. EDITOR : FAISAL KHAN, RNI : APTEL/2013/53323, CELL : 94400 62685